RNI TELTEL/2024/89620

తెలంగాణ

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 141 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | ఆదివారం - 12 జులై - 2026 | వెల రూ. 5 /-

మధుర గాయని ఎస్.జానకి

గుండెపోటుతో కన్నుమూత

నేటి శుభోదయ, హైదరాబాద్ : భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న ప్రముఖ గాయని, 'దక్షిణ భారత గాన కోకిల'గా ప్రఖ్యాతి గాంచిన ఎస్.జానకి (శిష్ట్లా శ్రీరామమూర్తి జానకి) ఇకలేరు. గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆమె, శనివారం, జూలై 11న కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. ఆరు దశాబ్దాల పాటు తన గాన మాధుర్యంతో కోట్లాది మంది సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసిన జానకమ్మ మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె మనవరాలు అప్సర వైద్యుల ఈ విషయాన్ని ధ్రువీకరించారు. జానకికి గుండెపోటు రావడంతో ఈ మధ్యాహ్నం 12.49 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అయితే, చికిత్స పొందుతూ రాత్రి 7.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించాయి.

గేట్లు మూస్తే ప్రమాదం

అందుకే నీటిని ఎత్తిపోయడం లేదు - రేవంత్ రెడ్డి

- ఎన్‌డీఎస్‌ఏ, నిపుణుల కమిటీ పర్యవేక్షణలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ
- నిర్మాణ లోపాల వల్లే మేడిగడ్డ కుంగిపోయింది: నివేదిక అంశాలను వివరించిన సీఎం
- గేట్లు మూసి నీటిని నిల్వ చేయడం బ్యారేజీలకే ప్రమాదకరం: రేవంత్ రెడ్డి
- ఈ నెలలోనే టెస్టింగ్ ప్రక్రియ పూర్తి.. ముంబయ్ ఐఐటీ, అంతర్జాతీయ నిపుణుల సూచనలతో ముందుకు

నేటి శుభోదయ, హైదరాబాద్ : నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) పర్యవేక్షణలో అందించే సిఫారసులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నియమించిన నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపడుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తో పాటు మరికొందరు ప్రజాప్రతినిధులతో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. బ్యారేజీల నిర్మాణం, నిర్వహణ, డిజైన్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో గేట్లు మూసి ..... »2

వియత్నాంలో ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక

- 15 మంది మృతి

- వియత్నాంలో భారత పర్యాటకులతో వెళుతున్న స్పీడ్‌బోట్ బోల్తా
- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం 2
- పు క్వాక్ దీవి సమీపంలో అదుపు తప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం

పోక్సో కేసులకు తెలంగాణ అడ్డాగా మారింది

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- దైవాలగూడలో ఆరుగురిని హత్య చేసిన పోక్సో కేసు నిందితుడు
- బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- నిందితుడు ఇప్పటికీ పరారీలో ఉండటం దారుణమన్న ప్రవీణ్ కుమార్ 2

ఎంత ఖర్చైనా నేనున్నా

- చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు రాజగోపాల్ రెడ్డి అభయం

- మరోసారి తన ఉదారతను చాటుకున్న రాజగోపాల్ రెడ్డి
- తన మనవడిని కాపాడాలంటూ రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించిన వృద్ధుడు
- తన ఫౌండేషన్ ద్వారా పూర్తి వైద్యం చేయిస్తానన్న రాజగోపాల్ రెడ్డి

నేటి శుభోదయ, మునుగోడు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకొని ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. తల్లిదండ్రులు లేక, తీవ్ర అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక చిన్నారికి తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా పూర్తి ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన మనవడిని బతికించాలంటూ ఒక వృద్ధుడు కన్నీరుమున్నీరవుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించారు. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఆ చిన్నారి మాత్రమే తనకున్న ఏకైక ఆస్తి అని, ఎలాగైనా కాపాడాలని ఆ తాత ఎమ్మెల్యే కాళ్లపై పడి తన ఆవేదనను వెళ్లగక్కారు... »2

టీజీపీఎస్సీ నుంచి మరో జాబ్ నోటిఫికేషన్..

- 7 టౌన్‌ప్లానింగ్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఉద్యోగ ప్రకటన
- ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 22 వరకు దరఖాస్తులకు తుది గడువు
- అక్టోబరులో రాత పరీక్ష నిర్వహించనున్న కమిషన్ »2

ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్న ఏబీవీపీ
- వీటిపై ఆధారపడి 20 లక్షల మంది విద్యార్థులు చదుకుంటున్నారని వెల్లడి
- ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీలు కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నాయని మండిపాటు »2

రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు - కేటీఆర్

- మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చన్న కేటీఆర్
- 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాఖ్య
- కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ

నేటి శుభోదయ, హైదరాబాద్ : తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకు పడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా... 2

రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి..

- కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

నేటి శుభోదయ, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో జరిగిన ఘోర హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలియగానే సంబంధిత పోలీస్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ... 2

వియత్నాంలో ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక - 15 మంది మృతి

మొదటిపేజీ తరువాయి..

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ స్టోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి ...

ఈ విషాద ఘటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "వియత్నాంలోని ఫు క్వోక్ సమీపంలో భారత పౌరులతో కూడిన పడవ ప్రమాదానికి గురైన విషాద వార్త తెలిసి చాలా బాధపడ్డాను. తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అస్వస్థతకు గురైన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని మోదీ పేర్కొన్నారు.

పోక్సో కేసులకు తెలంగాణ అడ్డాగా మారింది

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మొదటిపేజీ తరువాయి..

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో కేసు కక్షతో... ఆరు గురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ కేసు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పటోళ్ల కార్తీక్ రెడ్డి వంటి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో ఈ అరెస్టులు జరిగాయి. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. ప్రభుత్వం నిందితుడిని అరెస్టు చేయకుండా బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. నిందితుడు ఇంకా పరారీలో ఉండటం దారుణమని అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు - కేటీఆర్

నేటి శుభోదయ, హైదరాబాద్ : సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి..

- కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

నేటి శుభోదయ, హైదరాబాద్ : ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణం సహాయం అందించాలని, మానసిక-సామాజిక తోడ్పాటు కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు.మహిళలు, పిల్లల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని సీతక్క హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసు వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన దారుణ హత్యల వెనుక పోక్సో కేసు కక్ష ఉందని పోలీసు దర్యాప్తు వెల్లడైంది. నిందితుడు రాజ్‌కుమార్ (28) తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలు పంపిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపాడు. అనంతరం తన భార్య సరిత (పార్వతి సరిత), 3 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడిని కూడా కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘోర ఉదంతంలో మొత్తం ఆరుగురు మృతి చెందారు. గత మే 16న బాలికను వేధించాడని ఆమె తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మే 26న రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం బెయిల్‌పై విడుదలైన వెంటనే ఈ దారుణం చేశాడని పోలీసులు తెలిపారు.

గేట్లు మూస్తే ప్రమాదం.. అందుకే నీటిని ఎత్తిపోయడం లేదు - రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. బ్యారేజీల్లో నీటిని నిలువచేయడం వల్ల ప్రమాదం పొంచి ఉందని ఎన్డీఎస్ఏ సూచనల మేరకే నీటిని ఎత్తిపోయడం లేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వచేసి ఎత్తిపోయడానికి వీలులేని పరిస్థితులు, ఎన్డీఎస్ఏ నివేదిక అంశాలను ఆయన సమగ్రంగా వివరించారు. కాళేశ్వరం బ్యారేజీలను పునరుద్ధరించే విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2026 జూన్ 30 న టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీని నియమించిందని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్, పునరుద్ధరణ అంశాలపై ఆ కమిటీ ప్రతిపాదనలకు లోబడే పనులు జరగాలని నిర్దేశించారని పేర్కొన్నారు. ఎన్డీఎస్ఏ (టెక్నికల్) సభ్యుడు చైర్మన్‌గా, సీడబ్ల్యూసీ (డిజైన్స్ – బీసీడీ) డైరెక్టర్, సీడబ్ల్యూసీ (డిజైన్ – గేట్స్) డైరెక్టర్, ఎస్ఎం ఆర్ఎస్ నుంచి ఎస్ఈ స్థాయికి తగ్గకుండా ఒక ప్రతినిధి, సీడబ్ల్యూపీ ఆర్ఎస్ నుంచి ఎస్ఈ స్థాయికి తగ్గకుండా ఒక ఇంజనీర్, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎస్ఈ స్థాయికి తగ్గకుండా ముగ్గురు ప్రతినిధులు ఉండే విధంగా టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీని ఏర్పాటు చేశారని, ఈ కమిటీ తెలంగాణ ప్రభుత్వ నిపుణులు, జాతీయ, అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుంటుందని వెల్లడించారు. ఎన్డీఎస్ఏ తుది నివేదికను పరిగణలోకి తీసుకుని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ సూచనలను తూ.చ తప్పకుండా పాటించి అందుకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో బ్యారేజీల్లో నీటిని నిలువచేయడానికి ఏమాత్రం సహేతుకం కాదని ఎన్డీఎస్ఏ తన 365 పేజీల నివేదికలో చాలా స్పష్టంగా తెలిపినట్లు పేర్కొన్నారు. నీరు పారుతున్నప్పటికీ గోదావరి నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని, ఆ విషయంలో ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నందునే ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర వివరాలు తెలియజేస్తున్నామని, ఈ విషయంలో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆక్షేపించారు. గోదావరి నదిలో నీళ్లు పారినంత మాత్రాన ఎత్తిపోయడానికి వీలుకాదని, అందుకు బ్యారేజీలు ఏమాత్రం అనుకూలం కావని, నీటిని ఎత్తిపోయాలంటే ముందు నీటిని నిల్వచేయాలని, నిలువ చేయకుండా నీటిని ఎత్తిపోయడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. దేశంలోని ప్రాజెక్టులు, డ్యామ్‌ల పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 30 న పార్లమెంట్ ద్వారా డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను తెచ్చిందని, ఇలాంటి సందర్భాల్లో ఏ రాష్ట్రమైనా ఎన్డీఎస్ఏ ఆదేశాలు, సూచనలు పాటించాల్సిందేనని అన్నారు. 2023 లో మేడిగడ్డ ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే ఎన్డీఎస్ఏ పర్యటించి ప్రాథమిక నివేదిక అందించిందని, మేడిగడ్డ 7వ బ్లాక్ వద్ద బ్యారేజీ పిల్లర్లు 1.2 మీటర్లు కుంగిపోయాయని, ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాల కారణంగానే ఆ ప్రమాదం ఏర్పడిందని పేర్కొంది. మేడిగడ్డ 7వ బ్లాక్ డ్యామేజీ కావడం వల్ల మొత్తం బ్యారేజీపై ప్రభావం చూపించి దెబ్బతిన్నదని, ఇప్పుడున్న దుస్థితిని అరికట్టడానికి మూడు బ్యారేజీల స్థిరీకరణ, పునరుద్ధరణకు సమగ్రమైన అంచనాలు అవసరమని ఎన్డీఎస్ఏ తన ఎగ్జిక్యూటివ్ సమ్మరీలో తేల్చిచెప్పిందన్నారు. నీటిని ఎత్తిపోయడానికి పంపులు పనిచేయాలంటే మేడిగడ్డ బ్యారేజీ వద్ద 93.5 మీటర్ల మేరకు నీటిని నింపాలని, కనీసం 5 టీఎంసీల నీటిని నింపినప్పుడే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసి అన్నారంలో పోయాలని వివరించారు. బ్యారేజీల్లో నీటిని నిలువ చేయాలంటే గేట్లు మూయాలని, అయితే బ్యారేజీ గేట్లపైన హైడ్రాలిక్ ఒత్తిడిని తట్టుకునే పరిస్థితి లేనందున మరమ్మత్తులు చేసే వరకు గేట్లు మూయొద్దని ఎన్డీఎస్ఏ చెప్పినట్లు తెలిపారు. గేట్లు మూయలేని పరిస్థితి ఉన్నప్పుడు మేడిగడ్డ నుంచి ఎత్తిపోసిన నీళ్లు అన్నారం నుంచి తిరిగి మేడిగడ్డకే చేరుకుంటాయే తప్ప ప్రయోజనం లేదని, గేట్లు మూసి నీటిని నిల్వ చేయడం వల్ల ప్రాజెక్టు మొత్తానికి ప్రమాదం ఉండొచ్చని, భద్రాచలం పట్టణంతో పాటు ఊర్లకు ఊర్లు వరదలతో కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. నిజానికి ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువు, గుండెకాయ శ్రీపాద ఎల్లంపల్లి అని, గుండెకాయతోనే ఇప్పుడు ప్రాజెక్టు సాగుతోందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 2019 జూన్ 21 న కాళేశ్వరం ప్రారంభిస్తే, ప్రాజెక్టు పూర్తి కాకముందే 2020 మే 18 న ఆనాటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందులో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దకుండా నిర్మాణాలు చేపడితే బ్యారేజీకే ప్రమాదం ఉందని తెలియజేస్తూ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి లేఖ రాసిన విషయాన్ని, ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు ఉన్నట్లు తెలిపిన అంశాలను చదివి వినిపించారు. ఆ లోపాలను సరిదిద్దకపోవడం, పూర్తిగా నిర్లక్ష్యం వహించిన కారణంగానే మేడిగడ్డ కుప్పకూలిందని, దీనికి ముందు 2022 జూలై 14 న గోదావరి పోటెత్తిన సమయంలో రిటెయినింగ్ వాల్ కూలి కన్నెపల్లి పంప్‌హౌజ్ పూర్తిగా మునిగిపోయి దెబ్బతిన్నదని, ఆ పంప్‌హౌజ్‌ను ఇప్పటికీ నూటికి నూరు శాతం సరిదిద్దలేదని విమర్శించారు. మేడిగడ్డ కుంగిపోయిన మరుసటిరోజున మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని, 2023 అక్టోబర్ 22 న ఎన్డీఎస్ఏ నిపుణులు పరిస్థితిని పరిశీలించి ప్రాజెక్టు డిజైన్, ప్లానింగ్, నాణ్యత, నిర్మాణం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలను ఎత్తిచూపారని చెప్పారు. ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని, నిపుణుల కమిటీ, ఎన్డీఎస్ఏ సిఫారసులకు అనుగుణంగానే వారి పర్యవేక్షణలో ప్రాజెక్టును పునరుద్ధరిస్తున్నామని, ఈ నెలలో టెస్టింగ్ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాత ముంబయ్ ఐఐటీ, అంతర్జాతీయ నిపుణుల సూచనల మేరకు పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తామని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు.

ఎంత ఖర్చైనా నేనున్నా

- చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు రాజగోపాల్ రెడ్డి అభయం

మొదటిపేజీ తరువాయి.. ఆ వృద్ధుడి కష్టాన్ని చూసి చలించిపోయిన రాజగోపాల్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఆ చిన్నారి ప్రాణాలు కాపాడటానికి ఎంత ఖర్చైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్ తో పాటు పూర్తి ఉచిత వైద్యం అందించి, బాబును మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి పంపే బాధ్యత తనదేనని కొండంత భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న తమను దేవుడిలా ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆ వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

టీజీపీఎస్సీ నుంచి మరో జాబ్ నోటిఫికేషన్..

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తాజాగా మరో ఉద్యోగ ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగంలో ఖాళీగా ఉన్న 7 టౌన్‌ప్లానింగ్ సహాయకుల (టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్) పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ సూచించింది. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 22వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. మొత్తం 7 పోస్టులలో 2 రాష్ట్రస్థాయి కేడర్‌కు చెందినవి కాగా, మిగిలిన 5 పోస్టులు మల్టీజోనల్ కేడర్ పరిధిలోకి వస్తాయని టీజీపీఎస్సీ వివరించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీ.ప్లానింగ్ లేదా బీటెక్ (ప్లానింగ్)లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది అక్టోబరులో రాతపరీక్ష నిర్వహించనున్నట్లు కమిషన్ తన ప్రకటనలో స్పష్టం చేసింది. నియామకాలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో అందుబాటులో ఉంటాయి.

ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ

మొదటిపేజీ తరువాయి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏబీవీపీ విమర్శించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో జరుగుతున్న ఆలస్యాలను నిరసిస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ఏబీవీపీ ప్రకటించింది. వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు విడుదల చేయకపోవడంతో రూ. 11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేల మంది సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మడూరి సందీప్ రావు, జూపల్లి దీపిక, ఆరిపెల్లి సుజిత్, బెల్లం కార్తీక్, వేల్పుల రాజ్‌కుమార్, గుగులోత్ నవీన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పోటెత్తిన భక్తులు

శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం

మొదటిపేజీ తరువాయి.. తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 24 నుంచి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. భక్తుల రద్దీతో క్యూలైన్లు బయట పాచికల్వ గంగమ్మ గుడి వరకు బారులు తీరాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని, భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు సూచిస్తున్నారు. నిన్న శుక్రవారం (జూలై 10) ఒక్కరోజే 73,265 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 39,690 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ద్వారా రూ. 4.26 కోట్ల ఆదాయం లభించగా, 4.09 లక్షల లడ్డూలను విక్రయించారు. దాదాపు 2.98 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. వైద్య కేంద్రాల్లో 3,899 మందికి చికిత్స అందించినట్లు టీటీడీ వెల్లడించింది.

టి యు డబ్ల్యూ జే (ఐజేయు) సంగారెడ్డి జిల్లా యూనియన్
జనరల్ సెక్రటరీగా ఉల్లిగడ్డల శివకుమార్ ఏకగ్రీవ ఎన్నిక

సంగారెడ్డి, నేటి శుభోదయ :
ఏకగ్రీవక ఎన్నికకు కృతజ్ఞతలు రాష్ట్ర జిల్లా నాయకత్వానికి అభినందనలు జర్నలిస్టు విశ్వాసానికి ధన్యవాదాలు హక్కుల పరీక్ష నకు అంకితభావంతో కృషి సంక్షేమమే ప్రధాన లక్ష్యమని హామీటి యు డబ్ల్యూ జే (ఐజేయు) యూనియన్ సంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా ఉల్లిగడ్డల శివకుమార్ ఈకగ్రీవంగా ఎన్నిక య్యారు, తన ఎన్నికలకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు విరత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎంకె పైసల్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి, జిల్లా జర్నలిస్టుల మిత్రు లందరికీ ఆయన హృదయపూర్వక కృత జ్ఞతలు తెలిపారు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కోసం మరింత బాధ్యతయు తంగా పనిచేస్తానని జర్నలిస్టుల హక్కుల పరి రక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించే దానికి అంకిత భావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు చిన్న మధ్యతర వార్తాపత్రికల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సమిష్టిగా చర్యలు చేపడతా నని పేర్కొన్నారు జిల్లాలోని ప్రతి జర్నలి స్టులకు సంఘం అండగా నిలిచేలా కార్యచ రణ రూపొందిస్తానమనీ, వృత్తి, సంక్షేమం, గౌరవం, హక్కుల సాధన కోసం అన్ని స్థాయిలో సమన్యాయంతో ముందుకు సాగు తామని వెల్లడించారు జర్నలిస్టుల మధ్య ఐక్యతను బలపేతం చేయడం సంఘాన్ని మరింత బలపేతం చేయడం సభ్యుల సంక్షే మానికి ప్రాధాన్యత ఇవ్వడం, తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు ఉల్లిగడ్డల శివకు మార్ ఏకగ్రీవ ఎన్నిక పట్ల జిల్లా వ్యాప్తంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన

నాయకత్వంలో సంఘం మరింత చైతన్యవం తంగా పనిచేసే జర్నలిస్టుల పరిష్కారం కోసం కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభా వాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వేములనర్వలో SIR అవగాహన..
ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలని పిలుపు

కేశంపేట, నేటి శుభోదయ :
కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో శనివారం భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై తహసీల్దార్ రాజేందర్ రెడ్డి గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రతి అర్హులైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) అందజేయా లని సూచించారు. ఫారం సమర్పించడం ద్వారా ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు భవిష్యత్తులో ఓటు హక్కు వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని వివ రించారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే ఫారాలను సమర్పించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నరసింహులు, డిప్యూటీ సర్పంచ్ రమేష్ నాయక్, జీపీఓ విజయలక్ష్మి , అంగన్వాడీ టీచర్ సుగుణ, చిర్ర శ్రీను, మోటే శ్రీకాంత్, ఆవ రాఘవేందర్, చిర్ర

ప్రభాకర్, శివ, శ్రీరామ్, మంగళి శేఖర్, శంకర్ నాయక్, బూత్ లెవల్ అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ఫారాల నింపే విధానం, అవసరమైన పత్రాలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు.

ముళ్లపాదల్లో మునిగిన డ్రైనేజీ.. గుంతల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం!
-అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థులు, ప్రయాణికుల తీవ్ర ఆగ్రహం

నిజామాబాద్, నేటి శుభోదయ :
నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాళ్ల రామడుగు గ్రామం పల్లెటూళ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో నిధులు కేటాయిస్తు న్నామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. దానికి సజీవ సాక్ష్యమే ఈ గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీ దుస్థితి. పిచ్చి మొక్కలు, దట్టమైన ముళ్లపొదలు పెరిగి పోయి.. అసలక్కడ డ్రైనేజీ ఉందా లేదా అనే అనుమానం కలిగేలా రోడ్డు ప్రమాదకరంగా మారింది.కనిపించని డ్రైనేజీ.. పొంచివున్న ప్రమాదాలురోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ కాలువ పూర్తిగా చెత్తాచెదారం, గుర్రపుడెక్క, ముళ్లపొదలతో నిండిపోయింది. కాలువ అంచు ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం అజాగ్ర త్తగా ఉన్నా నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం పొంచివుంది. రోడ్డు కూడా సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాం దోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. "రాత్రి వేళల్లో ఇటుగా వెళ్ళాలంటేనే భయ మేస్తోంది. ముళ్లపొదలు రోడ్డుపైకి వచ్చేసాయి. డ్రైనేజీ ఎక్కడుందో కనిపిం చదు. చిన్న పిల్లలు, వృద్ధులు అటుగా వెళ్తే ప్రమాదం జరగడం ఖాయం." అని స్థానిక ప్రయాణికులు వాపోతున్నారు.విషసర్పాలకు నిలయంగా మారిన రోడ్డు పక్కన పొదలు ఈ దట్టమైన ముళ్లపొదలు కేవలం ప్రయా ణానికి మాత్రమే కాదు, ప్రజల ప్రాణాలకు కూడా ముప్పుగా మారాయి. ఈ పొదల్లో విషసర్పాలు, తేళ్లు మరియు ఇతర ప్రమాద కరమైన కీటకాలు చేరుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే ఈ దారి గుండా నడవడం అంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకోవడమే నని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు నిలిచిపోయిన మురికినీరు, చెత్త కారణంగా దోమలు విపరీతంగా పెరిగి పోయి.. చుట్టుపక్కల నివసించే ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. డ్రైనేజీని కమ్మేసిన ముళ్లపొదలను, చెత్తాచెదారాన్ని తక్షణమే జేసీబీ (JCB) సహాయంతో తొలగించాలి.డ్రైనేజీ కాలువ స్పష్టంగా కనిపించేలా, అవసరమైతే అక్కడ రక్షణ గోడ లేదా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. పంచాయతీ అధికా రులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పాలకులు, అధికారులు గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దానికి సజీవ సాక్ష్యమే ఈ తాళ్ల రామడుగు లోని అంతర్గత రహదారుల దుస్థితి. కొద్దిపాటి వర్షానికే ఊరిలోని ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గుంతల మయం.. నరకప్రాయం..గ్రామంలోని రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలుగా మారాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదచా రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నడవాలంటేనే గ్రామస్థులు జంకు తున్నారు. ముఖ్యంగా వృద్ధులు ఈ బురద రోడ్లపై ప్రయాణిస్తూ వెళ్ళటానికి భయపడు తున్నారు. బైక్‌లపై వెళ్లేవారు నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నది రోజుల తరబడి రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో తీవ్రమైన దుర్వాసన వస్తోంది. దోమలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రోడ్లన్నీ బురదమయంగా మారడం పట్ల గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపె ట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన చెందుతున్నారు.గ్రామస్థుల డిమాండ్: పంచాయతీ అధికారులు ఇప్పటి కైనా నిద్ర మత్తు వీడాలి. మా ఊరి రోడ్ల సమస్యను తక్షణమే పరిష్కరించి, కనీసం గుంతలైనా పూడ్చాలి. లేనిపక్షంలో గ్రామ స్థులమంతా కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్య క్రమాలు చేపడతాం." అని హెచ్చరిస్తు న్నారు.అధికారులు ఇకనైనా స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ రహదారులకు మర మ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

కరాటే లో చోటా ఖాన్ టీం విద్యార్థులు ప్రతిభ
- అభినందించిన డాక్టర్ కాపా మురళీకృష్ణ

వైరా, నేటి శుభోదయ :
వైరా నియోజకవర్గ కేంద్రంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల విజయన్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ నిర్వహిం చిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కరాటే పోటీల్లో వైరా పట్టణానికి చెందిన చోటా ఖాన్ కరాటే టీమ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరాటే పోటీల్లో ఇంటర్నేషనల్ స్థాయిలో 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే పోటీల్లో వైరా నుంచి తొమ్మిది మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అత్యంత ప్రతిభ కనబరచిన 9 మంది విద్యార్థులకు విజయన్ మార్సల్స్ ఆర్ట్స్ సంస్థ మెడల్స్ సర్టిఫికెట్లు టీం నిర్వాహకులు రఘుకు అందజేశారు. సంస్థ అందజేసిన మెడల్స్ సర్టిఫికెట్లను లయన్స్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఎస్సై పి.రామారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, ఉంద్రు శ్యాంబాబు, కరాటే మాస్టర్ గుంటి రెడ్డి రఘు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు చదువుతోపాటు కరాటేను వినియోగించుకోవాలని కోరారు. కరాటే ఆత్మరక్షణకు ఆరోగ్యకరంగా ఉండేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక మంలో కాంగ్రెస్ పార్టీ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ,లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లపాటి సీతారా ములు, ఎస్ఐ పి రామారావు, డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, కరాటే మాస్టర్ గుంటి రెడ్డి రఘు, లైన్స్ క్లబ్ ప్రతినిధులు ఏపూరి రాజారావు, వజినేపల్లి చక్రవర్తి, అప్పం సురేష్ స్థానికులు పాల్గొన్నారు.

మౌంట్ ఫోర్ట్ తో ఇన్వెస్టిచర్ వేడుకలు

ఖమ్మం, నేటి శుభోదయ :
ఖమ్మం జిల్లా మౌంట్ ఫోర్ట్ హైస్కూల్లో ఇన్వెస్టిచర్ వేడుక శనివారం నిర్వహిం చారు. స్థానిక త్రీ టౌన్ ఏరియా, గుట్టల బజార్ లోని మౌంట్ ఫోర్ట్ హైస్కూల్లో ఇన్వెస్టిచర్ వేడుక శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో పాఠశాల విద్యార్థి నాయకులకు, వివిధ సంఘాల అధ్యక్షులకు, కార్యదర్శులకు, ఇతర బాధ్యతలు స్వీకరించే విద్యార్థులకు, ఒక నిర్దిష్ట హోదా, గుర్తింపు, బ్యాడ్జీలు ప్రధానం చేశారు. ముఖ్య అతిథిగా బ్రదర్ సంతోష్ కుమార్ (ప్రిన్సిపాల్, సెయింట్ థెరీసా హై స్కూల్, రామకృష్ణ పురం) హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తమ కొత్త పాత్రలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఇన్వెస్టిచర్ వేడుకలో, విద్యార్థి నాయకులు తమ బ్యాడ్జ్‌లను ధరించి, పాఠశాల అభి వృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రదర్ జాన్ పాల్ మాట్లాడుతూ ఈ వేడుక విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతుంది. విద్యార్థులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు ఆశీర్వాద సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ కృతజ్ఞతలు
-జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం, నేటి శుభోదయ :
చింతకాని మండలం జగన్నాధపురం – మత్కేపల్లి క్రాస్ రోడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న రైతు ఆశీర్వాద సభను ఘనవిజయం చేసిన జిల్లా కలెక్టర్, పోలీసు కమిష నర్, జిల్లా అధికార యంత్రాంగం, ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగ సోదర సోదరీమణులకు, జిల్లాకాం గ్రెస్ నాయకులకు, బ్లాక్, మండల, పట్టణ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, సభ విజయవంతా నికి సహకరించిన ప్రజలందరికీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రైతు ఆశీర్వాద సభకు రైతులు, ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు విశేషంగా తరలివచ్చి విజ యవంతం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సభ నిర్వహణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరి సేవలు అభినందనీయమని కొనియా డారు.అలాగే సభకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులందరికీ నూతి సత్యనారా యణ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలిపారు..

జాతీయ నులిపురుగుల దినోత్సవానికి ముందుగా అవగాహన ర్యాలీ

నిజామాబాద్, నేటి శుభోదయ :

ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చిన్న వాల్గోట్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టి నులిపురుగుల నివారణ, ఆల్బెండాజోల్ మాత్రల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఎన్ఎం స్వప్న మాట్లాడుతూ, 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అర (½) ఆల్బెండాజోల్ మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక పూర్తి మాత్రను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. గ్రామంలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు.“మెరుగైన ఆరోగ్యం – మెరుగైన చదువు – బలమైన భవిష్యత్తు” అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల నులిపురుగులు నివారించబడటంతో పాటు రక్తహీనత తగ్గడం, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడం, పిల్లల శారీరక ఎదుగుదల, జ్ఞాపకశక్తి, చదువుపై ఏకాగ్రత పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. అలాగే నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరణ్య, జూనియర్ అసిస్టెంట్ సుమలత, ఏఎన్ఎం స్వప్న, ఆశ కార్యకర్త సుజాత, అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, విజయలత, రాంబాయి, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

హరితహారానికి త్రివేణి శ్రీకారం

ఖమ్మం , నేటి శుభోదయ :

"ఈరోజు ఒక మొక్క నాటుదాం, రేపటి భవిష్యత్తును కాపాడుదాం" అనే సందేశంతో త్రివేణి టాలెంట్ స్కూల్స్ ఆధ్వర్యంలో వనమహోత్సవం–2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలుపుతూ, తమ విద్యార్థులు పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారని,ఈ వనమహోత్సవం భూమాతను సంరక్షించే మహోన్నత ఉద్యమమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఎల్ నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం తగ్గి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించి భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్,ఉపాధ్యాయినీ–ఉపాధ్యాయలు, విద్యార్థినీ–విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆరికాయలపాడు బీసీ కాలనీలో తాగునీటి కష్టాలు

ఏన్కూర్, నేటి శుభోదయ :

ఏన్కూరు మండల పరిధిలోని ఆరికాయలపాడు గ్రామానికి చెందిన బీసీ కాలనీలో కొంతకాలంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు,వంట,ఇతర గృహ అవసరాలకు నీరు లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపారు.సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- **జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు**

ఖమ్మం, నేటి శుభోదయ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, జనాభా నియంత్రణ, తల్లి–శిశు ఆరోగ్యం, సమతుల్య కుటుంబ వ్యవస్థ, బాలికల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని, దీనివల్ల నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో ఆటంకాలు వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు.వర్షాకాలం ప్రారంభమైనందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను తరచూ శుభ్రపరచాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంట పాత్రల శుభ్రత, ఆహార నిల్వ విధానాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా హెచ్‌పీవీ టీకా యొక్క ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ డి. రామారావు, అర్హులైన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని, ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, పి హెచ్ సి ఎం వి పాలెం నుంచి హెచ్ఈఓ బద్రు ఆశాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్ "రైతు ఆశీర్వాద సభ" ఒక పచ్చి అబద్ధాల సభ

: ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపాటు

ఖమ్మం, నేటి శుభోదయ :

ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన "రైతు ఆశీర్వాద సభ" కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే ఒక పచ్చి అబద్ధాల సభ అని, రైతులను ఆశీర్వదించడానికి కాదు, వారిని వంచించడానికి పెట్టిన సభ అని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ మంత్రులు వేదికపై చెప్పినవన్నీ ఒట్టి బూటకపు మాటలేనని ఆయన కొట్టిపారేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఓ ప్రకటనలో, ఈ విధంగా మాట్లాడారు,

రైతు భరోసా, రుణ మాఫీ అంతా దగా, మాట తప్పిన కాంగ్రెస్

"కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతాంగాన్ని నట్టేట ముంచింది. ఎకరాకు రూ. 15,000 ఇస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి, ఇప్పుడు దాన్ని ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తోంది. గత తొమ్మిది రోజుల్లో రూ. 7,491 కోట్లు ఇచ్చామంటూ రేవంత్ రెడ్డి గారు చెబుతున్న లెక్కలన్నీ కాగితాలకే పరిమితం. క్షేత్ర స్థాయిలో ఏ ఒక్క రైతు పూర్తిస్థాయిలో లబ్ధి పొందలేదు. బ్యాంకుల్లో వేల కోట్ల రుణ మాఫీ చేశామని చెబుతున్నా, రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల సాకుతో సగానికి పైగా రైతులను రుణ మాఫీకి దూరం చేశారు. కేసీఆర్ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో పడ్డ 'రైతు బంధు' నిధులను నిలిపివేసి, రైతులను భిక్షగాళ్లలా మార్చిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదే."

అస్తవ్యస్తమైన విద్యుత్, రెవెన్యూ వ్యవస్థలు

"కేసీఆర్ పదేళ్ల సువర్ణ పాలనలో తెలంగాణ రైతాంగం 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను కళ్లారా చూసింది. రాత్రిపూట బావుల వద్దకు వెళ్లే తిప్పలు తప్పాయి. కానీ ఈ కాంగ్రెస్ 11 నెలల తుగ్లక్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అంధకారం నెలకొంది. లో-వోల్టేజ్ సమస్యలతో మోటర్లు కాలిపోతున్నాయి. ఇక ధరణి పోర్టల్‌ను రద్దు చేసి 'భూమాత' పేరుతో కాంగ్రెస్ తెస్తున్న మార్పులు కేవలం భూ కబ్జాలకు, పైరవీకారులకు దారులు వేయడానికే. ఈ-పాస్‌బుక్కుల పేరుతో సామాన్య రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారు."

కాళేశ్వరం, మేడిగడ్డపై కుట్రపూరిత రాజకీయం

"తెలంగాణను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు వారి అజ్ఞానానికి నిదర్శనం. స్వల్ప సాంకేతిక లోపంతో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగితే, దాన్ని బాగు చేసి రైతులకు నీరివ్వడం చేతగాక, కాంగ్రెస్ ప్రభుత్వం పగటి రాజకీయాలు చేస్తోంది. వరద నీటిని సముద్రం పాలు చేస్తూ, ప్రాజెక్టును ఎండబెట్టి రైతులను కరువులోకి నెడుతున్నారు. కేసీఆర్ కాళేశ్వరం కట్టబట్టే పదేళ్లపాటు తెలంగాణలో కోటి

ఎకరాల మాగాణం సాధ్యమైంది. రైతులు పండించిన ప్రతి గింజా కేసీఆర్ విజన్ వల్లే సాధ్యమైంది తప్ప, ఈ కాంగ్రెస్ చేతకాని తనం వల్ల కాదు."

అహంకారం కాంగ్రెస్ నేతలదే – ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం

"కేసీఆర్ ఫామ్‌హౌస్ గురించి మాట్లాడే రేవంత్ రెడ్డి, తాము సెక్రటేరియట్‌ను వదిలి కేవలం ఢిల్లీ చుట్టూ మోకరిల్లుతున్న విషయాన్ని మరువరాదు. అప్పుల కుప్ప అంటూ తెలంగాణపై విషం చిమ్ముతూ, మరోవైపు ఆరు గ్యారంటీలను అటకెక్కించారు. ఖమ్మం గడ్డ ఎప్పుడూ మోసాన్ని సహించదు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, వారి మోసపూరిత వాగ్దానాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం మరియు ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పడం ఖాయం. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుంది." అని అన్నారు.

వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి రూ.53.82 కోట్ల నిధుల మంజూరుపై సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

వైరా, నేటి శుభోదయ :

వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.53 కోట్ల 82 లక్షల నిధులను మంజూరు చేసిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన, డా. కాపా మురళి కృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మరియు వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైరా పట్టణ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వైరా ప్రజల చిరకాల కోరికలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషి చేయడంతో పాటు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నిరంతరం ప్రభుత్వ దృష్టికి స్థానిక సమస్యలను తీసుకెళ్లి నిధులు సాధించారని కొనియాడారు.రూ.53.82 కోట్ల నిధులతో పట్టణంలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సౌకర్యాల మెరుగుదలతో పాటు ప్రజలకు అవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, వైరా మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.వైరా అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క మల్లు కి, అలాగే నిధుల సాధనలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ కి నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల

కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు, కౌన్సిలర్స్ పణితి సైదులు, మోర్ శ్రీకాంత్, పట్టణ నాయకులు కన్నెగటి నగేష్, పెద్దప్రోలు లక్ష్మయ్య, ఉండ్రూ శ్యామ్ బాబు, వేముల రత్నాకర్, గోరంట్ల పిచ్చారావు, బొర్రా గోవింద రావు, కొల్లి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, నారపోగు రవి, ఏదునూరి శ్రీను (బుజ్జి), బత్తుల శ్రీను, బండారు నాగరాజు, షేక్ రహీమ్ (పండు), వాంకుడోత్ భిక్యా, తేజవత్ నాగేశ్వరావు, ఏదునూరి కోటయ్య, దురిశెట్టి నరసింహారావు, జనార్ధన్, కంభంపాటి సత్యనారాయణ, తోటకూరి శ్రీకాంత్, ఏదుమూరి రాము, గడసందుల దుర్గయ్య, పృధ్వీ, పర్స రవి, గూగులోత్ దుర్గా, ఉయ్యూరి రామకృష్ణ, పూర్ణకంటి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ప్రజల సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

- మాస్టర్ ప్లాన్ రహదారుల తొలగింపు, కుదింపుతో పాటు సీఆర్ఎంపీ రోడ్లకు నిధులివ్వాలని వినతి

నేరేడ్ మెట్, నేటి శుభోదయ : మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఐఏఎస్‌ను రసూల్‌పుర, బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవనంలో కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న మాస్టర్ ప్లాన్ రహదారుల ప్రతిపాదనలను పునఃపరిశీలించాలని కోరడంతో పాటు నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.కౌకూర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 11, 35, 50, 56 పరిధిలో ఉన్న శ్యామల లక్ష్మీనగర్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, విలాస్ స్ప్రింగ్ కాలనీలపై ప్రభావం చూపుతున్న హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లోని 60 మీటర్ల ప్రతిపాదిత రహదారిని పూర్తిగా తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ప్రతిపాదన కారణంగా స్థానిక ప్రజలు, స్థల యజమానులు నిర్మాణ అనుమతులు, ఆస్తుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మీర్జల్‌గూడ–చిన్మయ మార్గ్ రోడ్డులో ప్రతిపాదించిన 60 అడుగుల రహదారిని 30 అడుగులకు కుదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి ప్రతిపాదనతో స్థానిక నివాసితులు, స్థల యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రజలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.కాకతీయనగర్ డివిజన్ పరిధిలో ఏఎస్‌రావునగర్ నుంచి నేరేడ్మెట్ వరకు ఏఎస్‌రావునగర్, సాయినాథ్‌పురం, జేకే కాలనీ, సమతానగర్, కాకతీయనగర్ ప్రాంతాల మీదుగా ప్రతిపాదించిన 100 అడుగుల రహదారిని కూడా హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనతో వందలాది మంది ఆస్తి యజమానులు నష్టపోయే పరిస్థితి నెలకొన్నందున ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఇదే సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో సీఆర్ఎంపీ రహదారుల నిర్మాణ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రత్యేక వినతిపత్రం సమర్పించారు.ఎమ్మెల్యే సమర్పించిన వినతిపత్రాలపై హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

స్వప్నంలో లభించిన శివతత్వం..
ఆవిర్భవించిన విమలనాదేశ్వర క్షేత్రం...

శామీర్ పేట, నేటి శుభోదయ :
గురువు కోసం అన్వేషణతో ప్రారంభమైన ఓ సాధకుడి ఆధ్యాత్మిక ప్రయాణం, స్వప్నంలో లభించిన దివ్య మార్గదర్శనం, నిరంతర ధ్యానసాధన, అంతర్ముఖ అనుభూతుల ఫలితంగా ఆవిర్భవించిన క్షేత్రమే శ్రీ విమలనాదేశ్వర దేవస్థానం అని ఆలయ వ్యవస్థాపకుడు వివరిస్తున్నారు. హకీంపేట్ సమీపంలోని సింగాయపల్లిలో వెలసిన ఈ ఆలయం వెనుక ఉన్న ఆధ్యాత్మిక నేపథ్యాన్ని ఆయన వివరించారు.ఆయన కథనం ప్రకారం, ప్రతి మనిషికి గురువు అవసరమే అయినప్పటికీ, ఆధ్యాత్మిక ఉపదేశం కోసం ధనం చెల్లించాల్సి వస్తుందనే అభిప్రాయం తనను తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. సృష్టి అంతా ఒక మహాశక్తి ఆధీనంలో నడుస్తున్నప్పుడు, ఆ పరమాత్మనే తన గురువుగా భావించి భక్తి మార్గంలో అడుగుపెట్టినట్లు తెలిపారు.భక్తిని ప్రారంభించిన కొద్ది రోజులకే ఒక స్వప్నంలో వృద్ధుని స్వరం వినిపించిందని, ఆ స్వరం శివసాధనను ఆశ్రయించాలని, “ఓం నమో శివాయ” మంత్రాన్ని మోక్ష సంకల్పంతో జపించాలని ఉపదేశించిందని పేర్కొన్నారు. ఆ స్వప్నానంతరం ఎవరికీ తెలియకుండా రాత్రివేళల్లో గంటల తరబడి ధ్యానం కొనసాగించగా, రెండు కనుబొమ్మల మధ్య చిన్న తెల్లని కాంతి దర్శనమిచ్చిందని తెలిపారు. మూడు రోజుల సాధన అనంతరం ఆ కాంతి నీలి వర్ణంలోకి మారిందని, అది తన ఆధ్యాత్మిక ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచిందని చెప్పారు.తదనంతరం శివపంచాక్షరి సాధనలో లోతుగా ప్రవేశించిన సమయంలో అష్టదళ చక్రంపై పరమాత్మ తత్త్వం, విమలాత్మ తత్త్వం, సృష్టి క్రమం, బ్రహ్మాండ రహస్యాలపై అంతర్గత అవగాహన కలిగిందని ఆయన వెల్లడించారు. అప్పుడప్పుడు కాలజ్ఞానానికి సంబంధించిన అంశాలు కూడా తనకు స్ఫురిస్తుంటాయని తెలిపారు.ఈ సాధనలో తనకు స్ఫురించిన ప్రధాన తత్త్వం “నాద–బిందు–కళ” అని పేర్కొన్నారు. తన అనుభవంలో నాదమే విమలనాదం, బిందువే అమృత స్వరూపం, కళే ఆత్మ–పరమాత్మ–విమలాత్మల ఏకత్వానికి ప్రతీకగా అవగతమైందని చెప్పారు. ఈ మూడు తత్త్వాల సమన్వయమే “విమలనాదేశ్వర” స్వరూపమని ఆయన వివరించారు.ఈ ఆధ్యాత్మిక అనుభూతులు వ్యక్తిగత స్థాయిలో మాత్రమే పరిమితం కాకుండా, భావితరాలకు కూడా అందాలని సంకల్పించి, పరమాత్మ ఆదేశంగా భావించి శ్రీ విమలనాదేశ్వర దేవస్థానాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ క్షేత్రాన్ని సందర్శించే భక్తులు శివతత్వం, ధ్యానమార్గం, అంతర్ముఖ సాధన ప్రాముఖ్యతను తెలుసుకుని ఆధ్యాత్మిక చింతన వైపు అడుగులు వేయాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.సింగాయపల్లి, హకీంపేట్ సమీపంలో ఉన్న ఈ దేవస్థానం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ధ్యానసాధనకు అనువైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో కొనసాగుతోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.9ఎన్ ఏం పి టి 2 విమల నాగేశ్వర స్వామిని నిత్యం కలుస్తున్న పూజారి ధనవేంద్రయోగి

జర్నలిస్టుల సహనానికి పరీక్ష..
ప్రభుత్వంపై సమరశంఖం

నేరేడ్ మెట్, నేటి శుభోదయ : ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టుల సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో, ఆ తర్వాత కూడా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు ప్రకటించింది.ఈ ఉద్యమంలో భాగంగా ఈ నెల 13న మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు, అనంతరం ఈ నెల 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి హరిప్రసాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు పబ్బు మల్లేష్ గౌడ్, జిల్లా నాయకుడు బనావత్ రవి నాయక్ వెల్లడించారు.వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ కార్డులు పేరుకే ఉన్నాయని, నిమ్స్ ఆసుపత్రి మినహా ఇతర కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవి ఉపయోగపడకపోవడంతో అత్యవసర వైద్య సేవలు కూడా అందని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా నూతన హెల్త్ కార్డులను ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్లవేలాది కుటుంబాలు నిరాశలో ఉన్నాయని పేర్కొన్నారు. క్యాబినెట్ ఉపసంఘం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం లేకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జాప్యం కారణంగా బస్ పాస్‌లు, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు అందక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిత్యం విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. ప్రతి జర్నలిస్టుకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందించడంతో పాటు, వారి పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తూ వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇక మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 13న మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట, 15న సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాల్లో జిల్లాలోని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలే మార్గం - ఎఐటియుసి నేతలు

నేరేడ్ మెట్, నేటి శుభోదయ : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎఐటియుసి నాలుగో మహాసభలు అల్వాల్ మండలం యాప్రాల్ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు కె. స్వామి అధ్యక్షతన నిర్వహించారు.ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాష్ట్ర ఎఐటియుసి ఇన్‌చార్జి బోస్, జిల్లా గౌరవ అధ్యక్షులు రవిచంద్రన్, శంకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు దీర్ఘకాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులను బలహీనపరుస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం ప్రశ్నించే వారిపై వివిధ రూపాల్లో ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని ఆరోపించారు.రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.పెద్ద పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అవలంబిస్తూ, సామాన్య ప్రజలపై పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని మోపడం బాధాకరమని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కుల సాధన కోసం పోరాడాలని, భవిష్యత్ ఉద్యమాల్లో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని ఎఐటియుసి శ్రేణులకు పిలుపునిచ్చారు.

'సర్వజ్ఞ' లో ఘనంగా పాఠశాల ఎన్నికలు

ఖమ్మం, నేటి శుభోదయ :
ఖమ్మం నగరంలో గల వీడిఓస్ కాలనీ లోని సర్వజ్ఞ పాఠశాలలో పాఠశాల ఎన్నికలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన పాఠశాల విద్యార్థి సంఘం ఎన్నికలు అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ముగిశాయి.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ఎంతో అవసరమని, ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడానికే ఈ ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. గెలిచిన ప్రతి లీడర్ పాఠశాల క్రమశిక్షణకు, తోటి విద్యార్థుల ప్రగతికి బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.పాఠశాల డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన లీడర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదవులు అనేవి కేవలం హోదా కోసం కాదని, బాధ్యతతో కూడుకున్నవని గుర్తుచేశారు. పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఈ నూతన క్యాబినెట్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను సరైన పత్రాలు చూపించి తీసుకువెళ్లగలరు - వరంగల్ ట్రాఫిక్ సిఐ కోడూరి సుజాత

వరంగల్, నేటి శుభోదయ :
వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు కరోనా నుండి వివిధ కారణాలతో జప్తు చేయబడినటువంటి ద్విచక్ర వాహనాలను సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లగలరని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కోడూరి సుజాత తెలిపారు.వాహనదారులు యజమానులు మీ యొక్క ద్విచక్ర వాహనాలు ఏదైనా చిన్న చిన్న కారణాలతో జప్తు చేసి పోలీస్ స్టేషన్ నందు ఉంచిన యెడల, అట్టి వాహనాలకు సంబంధించిన సరియైన పత్రాలు చూపించి తీసుకొని వెళ్ళగలరని కోరారు..ఒకవేళ డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని మరియు పెండింగ్ చలాన్లు వంటి కేసులు పెండింగ్ లో ఉన్నట్లయితే అట్టి కేసులను త్వరితగతిన పరిష్కరించుకొని మీ యొక్క వాహనాలను తీసుకోని వెళ్లగలరని వరంగల్ ట్రై సిటీస్ పట్టణ ప్రజలు ఇట్టి విషయాన్ని గుర్తుంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఏదుల శంకర్ కుటుంబానికి డా, చారకొండ వెంకటేష్ హార్దిక సహాయం

తలకొండపల్లి, నేటి శుభోదయ :
తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీర్తిశేషులు ఏదుల శంకర్ జ్ఞాపకార్థం కార్యక్రమంలో తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్ పాల్గొని ఏదుల శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులని పరామర్శించి కుటుంబానికి రూ.10,000 రూపాయలు ఆర్థిక సహాయం అంద జేయడం జరిగింది. ఏదుల శంకర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులు అధైర్య పడద్దని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మిన్నాల డేవిడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాకి కృష్ణ,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తొండలపల్లి ప్రశాంత్ రెడ్డి,వార్డు సభ్యులు రేణు రెడ్డి,శెట్టి రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డే కిషన్,పాము మధుసూదన్ రెడ్డి,ఏదుల మచ్చేందర్,ఏదుల మహేష్,దుబ్బ విజయ్,పవన్ వాల్మీకి,తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళరాంపూర్ సర్పంచ్ కుటుంబానికి డొంకేశ్వర్ మండల సర్పంచుల ఫోరం అండ. రూ.50 వేల ఆర్థిక సాయం.

నిజామాబాద్, నేటి శుభోదయ :
తాళ్ళరాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జోరా పావని రెండు రోజుల క్రితం మృతి చెందిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని డొంకేశ్వర్ మండల సర్పంచులు నేడు స్వయంగా వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా పావని భర్త,పిల్లలను ఓదార్చుతూ వారికి మనోధైర్యాన్ని ఇచ్చారు.కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ,మండల సర్పంచులంతా కలిసి రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు బట్టు సంజీవ రాజ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొని,కుటుంబానికి తమ సంతాపాన్ని తెలియజేశారు.

సమాజ సామరస్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలి

-సద్భావన ఫోరమ్

నిజామాబాద్, నేటి శుభోదయ :
జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సద్భావన ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సమాజ సామరస్యం,ప్రజా హక్కులు,పౌర బాధ్యత లపై విస్తృతంగా చర్చించారు.సమాజంలో శాంతి,సౌభ్రాతృత్వ వాతావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని వక్తలు పిలుపుని చ్చారు.ఈ సందర్భంగా ఇటీవల ఆర్మూర్‌లో ఓ ఉపాధ్యాయుడిపై జరిగిన దాడి ఘటనను ప్రస్తావిస్తూ,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చట్టాన్ని గౌరవిస్తూ సమస్యలను శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు.పదవీ విరమణ చేసిన ఉద్యోగులు,వివిధ రంగాల అనుభవజ్ఞులు రోజుకు కనీసం అరగంట సమయాన్ని సామాజిక సేవకు కేటాయించి,సంఘటిత బృందాలుగా పనిచేస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయప డ్డారు.జిల్లాలో తాగునీటి సమస్యలు,బోర్‌వెల్స్,డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో జాప్యం,నిరుద్యోగం,ఇతర ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి ఉద్యమించాలని సద్భావన ఫోరమ్ నిర్ణయించింది.ప్రజా సమస్యలను కుల,మతా లకు అతీతంగా ప్రతి ఒక్కరి సమస్యగా భావించి,వాటి పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో షేక్ హుస్సేన్,మహ్మద్ జహీరుద్దీన్,బంగారు సాయిలు,కృపాల్ సింగ్,న్యాయవాది పులి జైపాల్,రాంచందర్,శివ,సత్యనారాయణ,నారాయణ రెడ్డి,రాజు,కిషన్ గౌడ్,సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు..

చెరువులోకి మురుగునీటి పైప్‌లైన్..

అధికారుల మౌనంపై అనుమానాలు

- అనుమతులు లేకుండానే నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం?
- రేణిగుంట చెరువు పరిరక్షణకు ముప్పు.. ముత్యం రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

శామీర్‌పేట, నేటి శుభోదయ :
చెరువుల పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలు, నిబంధనల ఉల్లం ఘనలపై కఠిన చర్యలు తీసుకుంటున్న తరుణంలో అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురారిపల్లి గ్రామంలో వెలుగుచూసిన ఓ నిర్మాణ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీ యాంశమైంది. అనుమతులకు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, అదే భవనం నుంచి వెలువడే మురుగునీటిని నేరుగా రేణిగుంట చెరువులోకి మళ్లించేలా భారీ డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపి స్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికా రులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

స్థానిక కౌన్సిలర్ యూసుఫ్ బాబా, గ్రామస్థుల కథనం ప్రకారం భవన నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నా యని, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అనుమతులు లేకుండానే చెరువులోకి మురుగు నీటిని మళ్లించే ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపిం చారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ చర్యలు చెరువు ఉనికికే ముప్పుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ బోరు నీటి విక్రయం తర్వాత మరో వివాదం

ఇదే భవన యజమాని గతంలో ప్రభుత్వ బోరు నీటిని ట్యాంకర్ల ద్వారా విక్రయిం చారనే ఆరోపణలు కూడా ఎదుర్కొన్నారని స్థానికులు పేర్కొన్నారు. ఆ సమయంలో స్థానిక ప్రజలతో కలిసి కౌన్సిలర్ యూసుఫ్ బాబా అధి కారులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యవహారానికి అడ్డుకట్ట పడిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ చెరు వులోకి మురుగునీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం అధికార యంత్రాంగం పనితీరుపై అనుమానాలకు తావిస్తోందని విమర్శిస్తున్నారు.

ఐదు ఎకరాల చెరువు రెండెకరాలకు కుదించారన్న ఆరోపణ

ఒకప్పుడు ఐదు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న రేణిగుంట చెరువు, క్రమంగా జరిగిన ఆక్రమణలతో ప్రస్తుతం రెండెకరాలకే పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) హద్దులను వెంటనే గుర్తించి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని పలుమార్లు జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు.

చర్యలు తీసుకుంటారా..? చూస్తూ ఊరుకుంటారా..?

చెరువులను పరిరక్షిస్తామని ప్రభుత్వం

ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై అధికా రులు మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అను మతులు లేకుండా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేప డుతున్న భవన యజమాని ముత్యం రెడ్డిపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ యూసుఫ్ బాబాతో పాటు ప్రజాప్రతిని ధులు, గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ వార్త ఆరోపణల ఆధారంగా రూపొందించబడింది. పత్రికా ప్రమాణాల దృష్ట్యా ప్రచురణకు ముందు సంబంధిత అధికా రులు, భవన యజమాని ముత్యం రెడ్డి స్పందనను కూడా జోడించడం సమతుల్య వార్తా కథనానికి అనుకూలంగా ఉంటుంది.

జిల్లాలో సీఎం సభతో జిల్లా విద్యా రంగానికి ఒరిగిందేమీ లేదు

ఖమ్మం, నేటి శుభోదయ :
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం నగర ముఖ్య కార్యకర్తల సమావేశం నగర కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఖమ్మం డివిజన్ అధ్యక్షులు రెడ్డి పోగుల త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ కోట్ల రూపాయలకు ఖర్చుపెట్టి నిన్న ఖమ్మం జిల్లాలో నిర్వహించిన సీఎం సభ వలన జిల్లా విద్యారంగానికి ఒరిగిందేమీ లేదని, విద్యా రంగంలో జిల్లాలో ఎక్కడున్న సమస్యలు అక్కడే ఉన్నాయని ఎన్నికల మేనిఫెస్టోలో సైతం ఖమ్మం జిల్లాకు ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని పెట్టిన కాంగ్రెస్ నాయకత్వం దాని గురించి మాట కూడా ఎత్తలేదని, అదేవిధంగా జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పే లెక్చరర్సే లేరని ఇప్పటివరకు కూడా సొంత భవనాన్ని కట్టినటువంటి పరిస్థితి లేదని అన్నారు. మరల మధిరలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ ఈ ప్రకటనలు ప్రక టనలు గానే కాకుండా కళాశాల ను ఏర్పాటు చేసి అక్కడ విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలను పాఠాలు చెప్పడానికి లెచరర్స్ ను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు కోసం యూనివర్సిటీలకు వెళ్లాలంటే వరంగల్ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లలేక విద్యను

మధ్యలోనే ఆపేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం దానిని దృష్టిలో పెట్టుకుని వారు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని నెరవేర్చి జిల్లాలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిన్న ముఖ్యమంత్రి జిల్లాకు వస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో విద్యా సంస్థలలో ఉన్న విద్యార్థులు మొత్తం స్వచ్ఛందంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వ హించిన బంద్ కు మద్దతు తెలిపారని ఇది చూసి అయినా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు, ఖమ్మం నగర నాయకులు లోకేష్, శ్యామ్, లోహిత్ కుమార్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన కుటుంబానికి ప్రణాళికాబద్ధ జీవనమే బలం

-ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యశాఖలో ప్రత్యేక కార్యక్రమం

మేడ్చల్ మల్కాజ్గిరి, నేటి శుభోదయ :
ఆరోగ్యకరమైన తల్లి–శిశు సంక్షేమానికి గర్భధారణల మధ్య సరైన వ్యవధి ఎంతో అవసరమని, ప్రణాళికాబద్ధమైన కుటుంబ వ్యవస్థ ద్వారానే కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం, సమాజ అభివృద్ధి సాధ్యమవుతాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం–2026 సందర్భంగా అంతా యిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా. ఆనంద్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని "ఆరోగ్యక రమైన మాతా–శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి – అనాలోచిత గర్భధారణల నివారణ" అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల మధ్య తగిన వ్యవధి పాటించడం ద్వారా కుటుంబాలు ఆరోగ్యవంతంగా, ఆర్థికంగా బలోపేతం అవు తాయని చెప్పారు.పెరుగుతున్న జనాభా కారణంగా ఆహారం, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక వనరులపై ఒత్తిడి పెరుగు తోందని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సాధనాల వినియోగం, మాతా–శిశు ఆరోగ్య సేవలపై ప్రజల్లో మరింత అవగా హన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా వ్యాప్తంగా ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కుటుంబ సంక్షేమ కార్య

క్రమాలపై అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఆరోగ్య విద్యా కార్యక్ర మాలు, అర్హులైన దంపతుల సన్మానం, కుటుంబ నియంత్రణ సేవల ప్రోత్సాహ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన జిల్లా వైద్యశాఖ ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అలాగే ఒక్క ఆడపిల్లతో కుటుంబ నియంత్రణను స్వీకరించిన దంపతులకు రూ.1,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.కార్యక్రమంలో మల్కాజిగిరి, కీసర ఉప జిల్లా వైద్యాధికారులు డా. లావణ్య, డా. గీత, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. నాగరాజు, డా. పవన్ రెడ్డి, డా. కౌశిక్, డెమో వసంత రెడ్డి, ఉషారాణి, విజయ్ కుమార్, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'సర్' ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలి

- బీఎల్ఓలు ఓటర్లకు పూర్తి సహకారం అందించాలి-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

మల్కాజిగిరి, నేటి శుభోదయ : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.శనివారం కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు ఫారాలను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, ఓటర్లు పూరించిన ఫారాలను వెంటనే స్వీకరిస్తున్నారా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్డెస్క్ను పరిశీలించి, ఫారాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటర్ల నుంచి సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని, ఈ ప్రక్రియలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని ఆపరేటర్లకు సూచించారు. అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు ఆదేశించారు. తమ పరిధిలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్వైజర్లకు వెంటనే తెలియజేయాలని సూచించారు.అనంతరం కెపిహెచ్బి ఆరవ దశలోని అపార్ట్మెంట్లలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సుదర్శన్ రెడ్డి, ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్డెస్క్ను సందర్శించి బీఎల్ఓల పనితీరును సమీక్షించారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడికి సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్పల్లి ఎమ్మార్వో అశోక్, డిప్యూటీ కలెక్టర్ ఆంజనేయులు, సూపర్వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

విహా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం

-'విహా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, నేటి శుభోదయ :
ఆమనగల్లు ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ నూతనంగా ఏర్పాటు చేసిన 'విహా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు .శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై పోస్టాఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని తలకొండపల్లి మండలం అంతా రం గ్రామానికి చెందిన ప్రముఖ శిశు వైద్య నిపుణులు డా.వెంకటేష్ దంపతుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ,మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, ఎస్హెచ్వో వెంకటేశ్వర్లు, తలకొండపల్లి కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆమనగల్లు కౌన్సిలర్లు, తదితరులతో కలిసి రిబ్బన్ కత్తిరించి, జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం ఓపీ, ఇన్పేషెంట్ వార్డులు,అత్యవసర చికిత్స విభాగం, ల్యాబ్ తదితర సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని అన్నారు.ప్రభుత్వ వైద్య సేవలకు తోడుగా ప్రైవేట్ ఆసుపత్రులు కూడా నాణ్యమైన చికిత్సను అందుబాటు ధరల్లో అందించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు.'విహా' ఆసుపత్రి కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలోడీసీసీ కార్యదర్శి మానయ్య కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్ శ్రీశైలం కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్ మాజీ ఎంపీపీ అనిత విజయ్ మాజీ మండల్ ప్రెసిడెంట్ జగన్ ఒగ్గు మహేష్ ఎంగలి ప్రసాద్ కృష్ణ నాయక్ ఖాదర్, ఫరీద్ అలీమ్ మహేష్ గౌస్ కుమార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నేతాజీ నగర్ లో పర్యటించిన ఎమ్మార్వో..

-ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ గా నమోదు చేయాలని కోరిన బేరీ రా0చందర్ యాదవ్..

శేరిలింగంపల్లి, నేటి శుభోదయ :
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ నమోదు ప్రక్రియ లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బస్తీ లలో చాలా మంది నిరుపేదలు నివసిస్తున్నారు. కాబట్టి వారికి చదువు రాకపోవడంతో ఫారాలు నింపడం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కాలని అధ్యక్షుడు బేరి రా0చందర్ యాదవ్ అన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆయన కోరిక మేరకునేతాజీ నగర్ కాలనీలో ఓటర్ నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి కాలనీలో పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నమోదు చేయాలని బిఎల్ఎ, బిఎల్ఓ లకు వివరించారు. కాలనీ అధ్యక్షులు రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు చొరవ తీసుకుని ప్రజలకు సహకరించాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తూ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. అవసరమైతే అధికారుల ను పెంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి దీపక్ కుమార్, బి ఎల్ ఓ పరమేష్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, బుడగ జంగాల పంతం వెంకటేష్, పంతం శీను, నాగపురి నగేష్ యాదవ్, ఎండి జాఫర్, శివ యాదవ్, మరియు నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు కాలనీ పెద్దలు మహిళా సోదరుల యోజన నాయకులు పాల్గొన్నారు ఓటు మన హక్కు ఓటు నమోదు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించిన రామచందర్ యాదవ్.

'పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం'

-సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం, నేటి శుభోదయ :
ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మసాన్ పల్లిలో వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, కల్యాణ మహోత్సవం

ములుగు, నేటి శుభోదయ : సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్ర పరిధిలోని మసాన్పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ తల్లి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఒడిబియ్యం పోసి, మంగళహారతులతో బోనాలు సమర్పించారు. మాసన్పల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలు, పూజలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కల్యాణం అనంతరం భక్తులందరికీ కమిటీ సభ్యులు భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దయతో గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు ఇంత ఘనంగా జరగడానికి ధన, వస్తు రూపేణా సహకరించిన దాతలకు, రాత్రింబవళ్లు కష్టపడిన గ్రామ యువకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ కులస్థులు, మహిళలు, యువకులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

బీసీలే రాజ్యాధికారం సాధించాలి

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి భిక్షపతి

గజ్వేల్, నేటి శుభోదయ : స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అగ్రవర్ణాల ఆధిపత్య పాలన కొనసాగుతోందని, ఇక ఆ పరిస్థితికి ముగింపు పలికి బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో జరిగిన మహాసభ విజయవంతం కావడం బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని అన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, కులాలకు అతీతంగా బీసీ రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్, అలాగే పార్టీ మండల, యువజన, రైతు విభాగాల నాయకులు, మల్లన్న అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మల్లాపూర్ ఎస్సీ కాలనీలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభోత్సవం చేసిన గ్రామ సర్పంచ్గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యం - మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి

షాద్నగర్, నేటి శుభోదయ : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని మల్లాపూర్ గ్రామములోని ఎస్సీ కాలనీలో గత సంవత్సరం నుండి డ్రైనేజీ ప్రాబ్లం వల్ల ప్రజలకు నానఇబ్బందిలూ ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ నరసింహారెడ్డి అన్నాడు గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యం గా మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి అన్నారు. శనివారం కొత్తూరు మండలంలోని మల్లాపూర్ ఎస్సీ వాడలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యంగా అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వరూప,పంచాయతీ సెక్రెటరీ విక్రమ్ రెడ్డి,వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి,స్వాతి రాజేష్,వరుణ్ గౌడ్,ప్రశాంత్, గ్రామ పెద్దలు నాయకులు పెంటారెడ్డి,పాపిరెడ్డి,దయానంద్ రెడ్డి,దామోదర్ రెడ్డి,శేఖర్ రెడ్డి, సుదర్శన్,పెద్ద నరసింహ, సుధాకర్,రాజు,నరసింహ,నవీన్, శ్రీశైలం,పద్మయ్య,దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌పహాడ్-చౌదరిగూడెం డబుల్ రోడ్డుకు రూ.7.50 కోట్ల మంజూరు

షాద్‌నగర్, నేటి శుభోదయ :
లాల్‌పహాడ్ నుంచి చౌదరిగూడెం వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక దృష్టి సారించడంతో లాల్‌పహాడ్–చౌదరిగూడెం డబుల్ రోడ్డుకు రూ.7.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు, ముఖ్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకోవాలి -జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

సంగారెడ్డి, నేటి శుభోదయ : రైతులకు యూరియా ఎరువుల సరఫరాను మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన "యూరియా బుకింగ్ యాప్" ద్వారా రైతులు ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు.జిల్లాలో ప్రస్తుతం 96,150 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లాలో అన్ని ఎరువుల విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు తమకు సమీపంలోని ఎరువుల దుకాణంలో యూరియాను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు బుక్ చేసిన 15 రోజులలోపు సంబంధిత విక్రయ కేంద్రానికి వెళ్లి యూరియాను పొందవచ్చని తెలిపారు.జిల్లాలో అత్యధికంగా పటాన్‌చెరు మండలంలో 13,093 బస్తాలు, నారాయణఖేడ్ మండలంలో 13,068 బస్తాలు, రాయికోడ్ మండలంలో 11,028 బస్తాలు, గుమ్మడిదల మండలంలో 6,394 బస్తాలు, మునిపల్లి మండలంలో 5,383 బస్తాలు, జహీరాబాద్ మండలంలో 4,053 బస్తాలు, కొండాపూర్ మండలంలో 3,758 బస్తాలు, కోహీర్ మండలంలో 3,648 బస్తాలు, జోగిపేట మండలంలో 3,544 బస్తాలు, సదాశివపేట మండలంలో 3,271 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా మండలాల్లో కలిపి 28,909 బస్తాలు నిల్వ ఉన్నాయని, మొత్తం జిల్లాలో 96,150 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.అదేవిధంగా, మార్క్‌ఫెడ్ గోదాముల్లో మరో 70,934 యూరియా బస్తాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరాన్ని బట్టి వెంటనే విక్రయ కేంద్రాలకు తరలించి రైతులకు అందజేస్తామని తెలిపారు.రైతులు యూరియా కొనుగోలు సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే అంగీకరించవద్దని, కొనుగోలు చేసిన ప్రతి బస్తాకు



తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, నిర్ణీత ధర కంటే అధిక ధర వసూలు చేసినా లేదా ఇతర సమస్యలు ఎదురైనా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

చిల్లర రాజకీయాలు చేసేది బిఆర్ఎస్సే

మధిర, నేటి శుభోదయ :
చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలో జరిగిన రైతు ఆశీర్వాద సభకు తరలి వచ్చిన వేలాది మంది రైతులు, ప్రజల జనసంద్రాన్ని చూసి బీఆర్ఎస్ నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, ప్రజల ఆదరణను జీర్ణించుకోలేక మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కపై చిల్లర విమర్శలు చేయడం ఆయన రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థాయి మరిచి ముఖ్యమంత్రి పైనే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, చిల్లర రాజకీయాలు చేసేది ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు. రైతు బంధు గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని, సంవత్సరాల పాటు కౌలు రైతులను, కిరాయి రైతులను పూర్తిగా విస్మరించి అసలు సాగు చేసే రైతును మోసం చేసింది బీఆర్ఎస్ అని విమర్శించారు.పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన , యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగాన్ని పెంచిన వారు, ఇప్పుడు ప్రజలకు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.ప్రజల మధ్యకు రావడానికి భయపడి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిన వారు, నేడు ప్రజల్లో తిరుగుతున్న ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. రైతు ఆశీర్వాద సభ విజయవంతం చూసే మతి భ్రమించి బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా వారి పద్ధతి మార్చుకోకపోతే ప్రజల తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.ఈ సమావేశంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోనే ధని కుమార్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పేద ఆడబిడ్డల కష్టాలు పట్టించుకోని మంథని ఎమ్మెల్యే

మంథని, నేటి శుభోదయ : గ్రామీణ ప్రాంతాల్లోని పేదింటి ఆడబిడ్డల కాన్పు కష్టాలను మంథని ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని, అధికారంలోకి వచ్చిన 30నెలలుగా మంథని మాతాశిశు ఆస్పత్రిలో డాక్టర్లను నియమించకపోవడం ఇందుకు నిదర్శనమని మంథని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ విమర్శించారు. మంథని పట్టనంలోని మాతాశిశు ఆస్పత్రిలో డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆస్పత్రి ఎదుట బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేశారని, అందులో బాగంగా ప్రభుత్వ ఆస్పత్రులకు ధీటుగా మాతాశిశు ఆస్పత్రులను తీసుకువచ్చారని, ఆనాడు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నాయకత్వంలో మంథనిలో మాతాశిశు ఆస్పత్రిని నిర్మాణం చేపట్టి పేదింటి ఆడబిడ్డలకు కాన్పు కష్టాలు తొలగించడం జరిగిందని వివరించారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంథని ఎమ్మెల్యే గెలిచిన వెంటనే మాతాశిశు ఆస్పత్రిలోని డాక్టర్లను ఇతర ప్రాంతాలకు పంపించారని, ప్రస్తుతం కేవలం సిబ్బంది మాత్రమే ఉన్నారని తెలిపారు. పలుమార్లు ఆస్పత్రికి వచ్చి వైద్యులను నియమించి ఆడబిడ్డల కష్టాలు తీర్చాలని కోరినా మంథని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, ఆయనకు ఈప్రాంతంలోని ఎవరిపై ప్రేమ లేకపోవడం మూలంగానే వైద్యం అందుబాటులోకి తీసుకురావడం లేదన్నారు. అడబిడ్డ అమ్మతనంలోకి అడుగుపెట్టాలంటే ఎన్ని కష్టాలు పడాలో ప్రతి ఒక్కరికి తెలుసునని, మంథని ఎమ్మెల్యేకు డెలివరి సమయంలో ఆడబిడ్డ పడే బాధను అర్థం చేసుకొనే అవకాశం లేదని, ఎందుకంటే వాళ్ల కుటుంబం కార్పోరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందుతారని ఆమె అన్నారు. 30నెలలుగా మాతాశిశు ఆస్పత్రిలో వైద్యులను నియమించకపోవడంతో ఎంతో విలువైన పరికరాలు, యంత్రాలు బూజుపట్టి పోతున్నాయని, కనీసం పరికరాలను వినియోగించుకోవాలని ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హాయాంలో ఆస్పత్రి నిర్మిస్తే అందులో వైద్యులు నియమించకుండా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని, అలాగే మంథనిలో ఏర్పాటు చేసిన పూల కుండీలను తొలగించారని, తమ ఆనవాళ్లను లేకుండా చేస్తూ

పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆడబిడ్డ ప్రసవాల కోసం గోదావరిఖనిలాంటి పట్టణాలకు పంపించేవారని, అక్కడ వారు పడే కష్టాలను చూసే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మతాశిశు ఆస్పత్రి తీసుకువస్తే ఈనాడు ఆస్పత్రి నిర్వహణను మంథని ఎమ్మెల్యే గాలికివదిలేశాడని విమర్శించారు. పరిసర ప్రాంతాల్లోని ఎంతో మంది గర్భిణీలు చికిత్స కోసం మాతాశిశుకు వచ్చి డాక్టర్లు లేకపోవడంతో వెనుదిరిగి పోతున్నారని, ఇలాంటి పరిస్థితులకు కారణం మంథని ఎమ్మెల్యే నిర్లక్ష్యమేనని ఆయన అన్నారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే స్పందించి మాతాశిశులో అవసరమైన వైద్యులను నియమించాలని, లేనిపక్షంలో మహిళలతో కలిసి నిరాహారదీక్షలు చేపట్టుతామని ఆమె స్పష్టం చేశారు. అంతకు ముందుకు జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. వెంటనే వైద్యుల నియామకంపై దృష్టి పెట్టాలని, సాకులు చెప్పి వైద్యుల నియామకంలో ఆలస్యం చేస్తే ఆందోళనలు ఉదృతం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత ,మాజీ ఎంపీపీ ఎగోలపు కమల,మాజీ జడ్పీటీసీలు తగరం సుమలత, మాధారవేణి శారదా, మాజీ ఉపసర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మి , సర్పంచ్ లు కనవేన స్వప్న, కొండ ప్రేమలత, తొంబరపు సుజాత, పోలుదాసరీ వనిత, తాటికొండ లక్ష్మీ నాయకురాలు సౌజన్య రెడ్డి, శ్రీ లక్ష్మీ చౌదరి,ఆశకు మారి, గోషిక అరుణ,స్వరూప,పద్మ , అరుణ,వాణి,స్రవంతి,లక్ష్మీ,అశ్వినీ, జ్యోతి, రమాదేవి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

SIR ప్రక్రియలో అన్యూమరేషన్ ఫామ్ అందజేసిన

ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, నేటి శుభోదయ :
ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన అన్యూమరేషన్ ఫామ్‌ను పూర్తి వివరాలతో నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారి BLO అనురాధ, జయశ్రీ , లకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా ప్రజలు SIR ప్రక్రియలో బాధ్యతగా పాల్గొనాలని సూచించారు. అన్యూమరేషన్ ఫామ్‌లు అందుకున్న ప్రతి ఒక్కరూ తమ పూర్తి వివరాలను సరిచూసుకుని, ఫామ్‌ను నింపి సంబంధిత BLOలకు అందజేయాలని కోరారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, SIR ప్రక్రియపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చింత ప్రభాకర్ సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు ర్యాకల్ వీరేశం పాల్గొన్నారు.

బ్యాంకుల ద్వారా రైతు భరోసా పైకం రైతులకి ఇవ్వాలి

-డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

పాల్వంచ, నేటి శుభోదయ : కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రైతు ఖాతాల్లోకి జమ చేస్తున్న రైతు భరోసా పైకాన్ని రైతులకు అందజేయాలని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సహకార సంఘం అధ్యక్షులు కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని మల్లారం గ్రామ మహిళా రైతుల స్వయం సహాయక గ్రూపుల్లోని ఖాతాల్లోకి రైతు భరోసా పైకం వేశారు. అట్టి రైతు భరోసా పైకాన్ని బ్యాంకర్లు రైతుల అప్పు క్రింద జమ చేసుకొని రైతులకు పైకం ఇవ్వడం లేదు. ఈ విషయాన్ని రైతులు కొత్వాల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కొత్వాల వెంటనే ఎస్.బి.ఐ కిన్నెరసాని శాఖ మేనేజర్ వెంకటరెడ్డిని కలసి బ్యాంకు సిబ్బందితో మాట్లాడి మహిళా రైతులకు రైతు భరోసా పైకాన్ని ఇప్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద ఒక ఎకరానికి 12 వేల రూపాయలు పెట్టుబడి సాయం కింద అందజేస్తున్నదని బ్యాంకర్లు వాటిని తమ బ్యాంక్ అప్పుల క్రింద జమ చేసుకోవడం సరికాదన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న రైతు భరోసా పైకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.

కొత్వాలకు మహిళా సంఘాల సభ్యులు ప్రశంసలు

రైతు భరోసా పైకాన్ని బ్యాంకులు ఇవ్వకపోవడంతో మహిళా రైతులు ఆందోళన చెంది విషయాన్ని సొసైటీ చైర్మన్ కొత్వాల దృష్టికి తీసుకుపోగా ఆయన వెంటనే స్పందించి బ్యాంకర్లతో మాట్లాడి రైతు భరోసా పైకాన్ని ఇప్పించటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన కొత్వాల చొరవ పట్ల మహిళా రైతులు హర్షం వ్యక్తం చేశారు కొత్వాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండలం పరిధిలోని మల్లారం గ్రామ మహిళా రైతులు, పాల్వంచ సొసైటీ డైరెక్టర్ బుడగం రామ్మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, వై. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

రైతులకు ఎరువుల గురించి ఆందోళన వద్దు

- యాచారం మండల అగ్రికల్చర్ అధికారి రవినాథ్.

ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :
యాచారం మండలంలోని రైతు సోదరులకు ముఖ్య గమనికగా గమనించవచ్చు మన మండలంలో రైతులకు ముఖ్యంగా తెలియజేయునది,అవసరమైన సాగు చేసే ప్రతి రైతుకు యూరియా,ఇతర ఎరువులు అందుతాయి. యూరియా,ఇతర ఎరువులు కావలసిన రైతులు వారు ఎరువుల యాప్ లో మన రంగా రెడ్డి జిల్లాలోనీ పి సి ఎస్ ఏ ఆర్ ఎస్ కె హెచ్ ఏ సి ఏ ఇతర డీలర్ల దగ్గర ఎక్కడ లభ్యత వుందో అక్కడ మన ఎరువుల యాప్ లో ఎరువులను బుక్ చేసుకునే వెసులుబాటు వుంది. ఈ ఎరువులను రైతులు ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ లోనే బుక్ చేసుకొని, వచ్చిన క్యూఆర్ కోడ్ ను ఎరువులు బుక్ చేసిన పిఎసిఎస్ ప్రవేట్లో తీసుకొనవచ్చు. ఈ యాప్ ద్వారా రైతు తమ స్వీయ ధృవీకరణ ద్వారా ఎరువులు బుక్ చేసుకోనవచ్చు. ఈ యాప్ పై మన మండలం లోని ప్రతి గ్రామంలో జరిగిన గ్రామసభల్లో అవగాహన కల్పించడం జరిగింది.ఇంకా ఈ యాప్ లో ఏమైనా సందేహాలు ఉన్న రైతులు తమ క్లస్టర్ ఏఈఓ/మండల వ్యవసాయ శాఖ గానీ, ఎరువులు ఉన్న డీలర్ దగ్గరగానీ, మన మండలంలో వున్న అన్ని ఎరువుల డీలర్స్ దగ్గర గాని, మీ సమీప మీసేవ/CSC సెంటర్ ద్వారా గాని,నెంబర్: 1800237157 ద్వారా గాని సహకారం పొందవచ్చు.అదేవిధంగా రైతులు ఎంత వరకు సాగు చేస్తారో అన్ని బస్తాలు బుక్ చేసుకోవాలి. తోటి రైతులకు కూడా అవకాశం ఇవ్వాలని మనవి.అలాగే మన మండలంలో కాంప్లెక్స్ ఎరువులు తగినంత అందుబాటులో ఉన్నాయి. కాంప్లెక్స్ ఎరువులో కూడా యూరియాలో ఉన్న నత్రజని ఉంటుంది. ఈ కాంప్లెక్స్ ఎరువులు కూడా అన్ని పంటలలో వాడచ్చు.అలాగే ఇప్పుడు ప్రభావం వుంది కాబట్టి ద్రవ రూప ఎరువులు, నానో యూరియా, నానో డి ఏ పి, నీటిలో కరిగే 19.19.19 వంటి ద్రవ రూపంలో ఉన్న ఎరువులు పిచికారీ చెయ్యగ లరు.ఇవి తీసుకోవడానికి యాప్ తో సంబంధం లేదు. నేరుగా ఎరువుల షాపు లో తీసుకొనవచ్చుకాబట్టి రైతులు ఎవరు కూడా యూరియా, ఎరువులు కోసం ఆందోళన చెందవదు. ఇది నిరంతర ప్రక్రియ. మీకు పంటలలో ఎలాంటి సందేహాలు ఉన్న మీ ఏఈఓ ఎంఏఓ ని సంప్రదించగలరు.అలాగే అందరు రైతులు

తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు ఐ డి పొందగలరు. రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుంటానే మీకు ఎరువులు,రైతు భరోసా,రైతు భీమా,వ్యవసాయ పరికరాలు, యంత్రాలు,డ్రిప్ పథకాలు,మొదలగు అన్ని రైతుకు సంబంధించిన పథకాలు అర్హులు అవుతారు.రైతులందరూ ఈ విషయాన్ని గమనించి తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోగలరు.అలాగే ఇప్పుడు కందులు,జొన్నలు సబ్సిడీ ద్వారా రైతు వేదిక యాచారం లో అందుబాటులో ఉన్నవి. కావలసిన రైతులు తీసుకొనగలరు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలి

షాద్నగర్, నేటి శుభోదయ :
జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు షాద్నగర్లో నిర్వహించిన మీడియా సమావేశంలో టిడబ్ల్యూజేఎఫ్ షాద్నగర్ డివిజన్ అధ్యక్షులు జె. రాఘవేందర్ గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహారెడ్డి, డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి సాయినాథ్ రెడ్డి మాట్లాడారు.

13న కలెక్టరేట్ వద్ద నిరసన..
జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావాలిజర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 13న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు ఉదయం 9 గంటలకు షాద్నగర్ మండల పరిషత్ కార్యాలయం నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో బయలుదేరి కలెక్టరేట్కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేసి ప్రభుత్వ దృష్టికి జర్నలిస్టుల సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు.

15న సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా
జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ ఈ నెల 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హెల్త్ కార్డులు అమలు కావడం లేదు
జర్నలిస్టులకు జారీ చేసిన హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు కావడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అన్ని గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, జర్నలిస్టులందరికీ నూతన హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలిజర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదని విమర్శించారు. జర్నలిస్టులకు ఆశలు చూపి, తర్వాత ఆ ఆశలపై నీళ్లు చల్లే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. వెంటనే ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు.

అక్రిడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి
అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ఆలస్యం అవుతోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు లేక బస్ పాస్లు పొందడంలో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

పెన్షన్, ఫీజు రాయితీపై డిమాండ్
జర్నలిస్టులకు నెలకు రూ.10 వేల పెన్షన్ మంజూరు చేయాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆగస్టు నెలాఖరులో రాష్ట్ర మహాసభలు
టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు నెలాఖరులో రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమాల్లో పాల్గొని హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పాల్గొన్న నాయకులుఈ సమావేశంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ షాద్నగర్ డివిజన్ అధ్యక్షులు జె. రాఘవేందర్ గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, సభ్యులు రాకేష్, కృష్ణ, మహేష్, శివకుమార్, మల్లేష్, రాజు, శేఖర్, వారణాసి జగన్, దిర్శనం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామను సత్వరం పూర్తి చేయండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సిపిఐ వినతి

ఖమ్మం, నేటి శుభోదయ :
ఉమ్మడి ఖమ్మంజిల్లా సాగు నీటికి సంబంధించి ప్రధాన జీవనాధారంగా ఉన్న సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు సాగునీటిని ఇవ్వడంతో పాటు నాలుగున్నర లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరికరణకు –సంబంధించి ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు నిధుల కేటాయింపు లేక నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు బిఆర్ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు సరైన రీతిలో లేకపోవడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతూ వచ్చిందన్నారు. ఎలినినో ప్రభావం కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల రీత్యా సీతారామ సత్వర నిర్మాణానికి సరిపడ నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మం మినహా అన్ని ఉమ్మడిజిల్లాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మంలో యూనివర్సిటీని స్థాపించాలని జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను –నెలకొల్పాలని సంక్షోభంలో కూరుకుపోతున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని వినతి పత్రంలో

పేర్కొన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా –లక్షన్నర మంది ఆధారపడిన గ్రానైట్ పరిశ్రమకు చేయూతనివ్వాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మంజిల్లాలో వ్యవసాయ ఆధారిత –పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. ఖమ్మం నగరం ఇటీవల కాలంలో బాగా విస్తరించిందని ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని ఫ్లైఓవర్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, –రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి గోపాలరావు ఉన్నారు.

గజ్వేల్‌లో సేవా కార్యక్రమాలతో ఎన్.సి. సంతోష్ జన్మదిన వేడుకలు

గజ్వేల్, నేటి శుభోదయ : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బిఆర్ఎస్ నాయకులు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ జన్మదిన వేడుకలు శనివారం సేవా భావం, భక్తి భావంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ వ్యాప్తంగా పలు సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ద్వారకా వెంచర్‌లో మొక్కలు నాటి, నేమింగ్ బోర్డులను ప్రారంభించారు. అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల డిజిటల్ విద్యా భవిష్యత్తు కోసం ఒక ఎల్ఈడీ టీవీని బహూకరించి, చిన్నారులకు బిస్కెట్లను అందజేశారు. స్థానిక గజ్వేల్ కోర్టు ప్రాంగణంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి కూలింగ్ వాటర్ డిస్పెన్సర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మ బాయి నర్సింగరావు, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, అయ్యప్ప దేవాలయం ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్.సి. సంతోష్ జన్మదినాన్ని ఆడంబరాలకు పోకుండా, సమాజానికి ఉపయోగపడే వినూత్న రీతిలో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తాత రాజయ్య రాజకీయ స్ఫూర్తితో, తండ్రి ఎన్.సి. రాజమౌళి అడుగుజాడల్లో నడుస్తూ సంతోష్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్ సభ్యులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నాయకులు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

-శ్రీ సిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు

ఖమ్మం, నేటి శుభోదయ : మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల ఆర్థిక ఎదుగుదల సమాజ ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని శ్రీసిటీ ఛైర్మన్ గరిక పాటి వెంకట్రావు తెలిపారు. మాతృశ్రీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. గతంలోనూ కుట్లు, అల్లికలు నేర్చుకున్న మహిళలకు శ్రీసిటీ ఛైర్మన్ గా సొంత నిధులతో కుట్టు మిషన్లు అందజేసిన –విషయం విధితమే. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు కేవలం మిషన్ నేర్చుకోవడానికి పరిమితం కాకుండా ఇప్పుడు ఉన్న –అవకాశాలను అందిపుచ్చుకుని వ్యాపారపరమైన ఆలోచనలు చేయాలన్నారు. వివిధ సంస్థల నుంచి ఆర్డర్లు పొంది తద్వారా జీవనోపాధికి మార్గాన్ని ఏర్పరచుకోవాలనీ వెంకట్రావు సూచించారు. నేడు ఉన్న సమాజంలో మహిళలకు సైతం పలు అవకాశాలు వస్తున్నాయని వాటిని అందిపుచ్చుకున్న వారు ముందు వరుసలో ఉన్నారని ఆయన తెలిపారు. శ్రీసిటీ అనేది రాష్ట్రంలోనే ఒక ల్యాండ్ మార్క్ కానుందని దానికి అందరూ సహకరించాలన్నారు. కేవలం నివాస పరంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా అన్ని వసతులు ఉన్నటువంటి ప్రాంతంగా తీర్చిదిద్దనున్నామని వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే విద్య పరంగా చేయూతనిచ్చామని రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలతో శ్రీసిటీని –ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్రెడ్డి, రమేష్, మాజీ సర్పంచ్ పాండు పాల్గొన్నారు.

ఇంటర్ సర్టిఫికెట్ లు ఇవ్వకుంటే గుర్తింపు రద్దు

- ప్రైవేటు కళాశాలలకు జిల్లా ఇంటర్ విద్య అధికారి హెచ్చరిక

నిజామాబాద్, నేటి శుభోదయ :

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థిని, విద్యార్థులకు ఫీజుల బకాయిల పేరిట సర్టిఫెక్ట్ లు ఇవ్వకుండా వేధిస్తే ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు ఆ కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ హెచ్చరించారు.గత మార్చి వార్షిక,మే సప్లిమెంటరీ పరీక్షలలో ఇంటర్ పాస్ అయిన విద్యార్థిని,విద్యార్థులు పై చదువుల కోసం వారికి ఇవ్వాల్సిన టి.సీ.లు,బోనోఫైడ్ ఇతర ధృవీకరణ పత్రాలు ఇవ్వడానికి ఇబ్బందులకు గురి చేసే కళాశాల యాజమాన్యాల పై బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థిని,విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తే జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు.నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు కళాశాలల పై ఇంటర్ బోర్డు కు నివేదిస్తామనీ జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు.

ఎవరి ఓట్లు పోవు.
అపోహలు వద్దు.

ఏన్కూర్, నేటి శుభోదయ :
సర్ పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు బిజెపి పార్టీ తిప్పి కొట్టాలని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు .బిజెపి ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ సర్ సమావేశం ఏన్కూరు మండల కేంద్రంలోని ఠాగూర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సర్ పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పుకొట్టాలని ప్రజల్లో లేనిపోని అపోహలు కల్పిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. భారతదేశంలోని ప్రతి పౌరుడి ఓట్లు పోవని నకిలీ ఓట్లు చనిపోయిన మాత్రమే తొలగించబడతాయని తెలిపారు. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బి ఎల్ ఏ లు అన్ని బూతులు తిరిగి పనిచేయాలని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నరకుల వెంకటేశ్వరరావు, కిషన్ మూర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరు రమేష్, జిల్లా సీనియర్ నాయకులు మందనపు సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు బండారు నరేష్, ఏన్కూర్ వైరా జూలూరుపాడు మండల అధ్యక్షులు మాజీ మండల అధ్యక్షుడు నల్లమోతు రమేష్ ,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ లో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి స్క్రీనింగ్ క్యాంప్

నిజామాబాద్ , నేటి శుభోదయ :
నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్లో జర్నలిస్టులకు,వారి కుటుంబ సభ్యులకు డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి స్క్రీనింగ్ క్యాంపులో నిర్వహించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి సుభాష్ వాగ్మారే మాట్లాడుతూ....డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి క్యాంపులో ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ప్రీ విలేజ్ కార్డును సైతం జర్నలిస్టుల కోసం అందజేశారని,ఇందులో జె హెచ్ ఎస్ ఉన్న జర్నలిస్టులకు ఉచితంగా కంటి ఆపరేషన్ సైతం నిర్వహిస్తారని తెలిపారు.ఈ అవకాశాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇచ్చే కార్డు తో పాటు జెహెచ్ఎస్ లో ఉచిత ఓపి,ఉచిత కంటి పరీక్షలు,ఉచిత సర్జరీలు నిర్వహిస్తారని తెలిపారన్నారు.ప్రస్తుతం హైదరాబాద్ కు వెళ్లకుండా నిజామాబాద్ అగర్వాల్ ఆసుపత్రిలోనే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వారు తెలియజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు,ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంథని మున్సిపాలిటీలోని 10వ, 11వ వార్డుల్లో సందర్శించిన -మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్

మంథని, నేటి శుభోదయ :
మంథని మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు మరియు 11వ వార్డులలో శనివారం వార్డు సందర్శన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చెత్తను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ సానిటేషన్ సిబ్బందికి అందజేసి మున్సిపాలిటీతో సహకరించాలని సూచించారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ , వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, యెల్లంకి పంశేధర్, సంబంధిత అధికారులు,కాంగ్రెస్ నాయకులు ఎరుకల రమేష్, జంభోజు సమ్మయ్య, సానిటేషన్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గజ్వేల్ చేనేత సహకార సంఘం
అధ్యక్షులు స్వర్గం రాజేశం

గజ్వేల్, నేటి శుభోదయ :
పేద పద్మశాలీలు, చేనేత కార్మిక కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని గజ్వేల్ చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులు స్వర్గం రాజేశం స్పష్టం చేశారు. శనివారం జరిగిన గజ్వేల్ చేనేత సహకార సంఘం కార్యవర్గ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షులు స్వర్గం రాజేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, వారి సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను చిత్తశుద్ధితో లబ్ధిదారులకు చేరవేస్తామని హామీ ఇచ్చారు. చేనేత మిత్ర, నేతన్న భరోసా, నేతన్న పొదుపు వంటి పథకాల ద్వారా కార్మికులను ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ముడి సరుకులు, నూలు, రసాయనాలు ప్రతి కార్మికుడికి అందేలా చూస్తామన్నారు. చేనేత కార్మికులకు వర్తించే రూ. 5 లక్షల బీమా వసతిని అర్హులందరికీ వర్తింపజేస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సమిష్టి నిర్ణయాలతో సంఘ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ కార్య

క్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సంఘం ఉపాధ్యక్షులు వల్లందాస్ సత్యనారాయణ, కార్యదర్శి ఎలగందుల రామచంద్రం, డైరెక్టర్లు జిల్లా భాగ్యలక్ష్మి , అమృతమ్మ, దొంతుల ప్రసాద్, పద్మశాలి సంఘం బాధ్యులు బింగి పురుషోత్తం, గాడిపల్లి అనూప్, రాజారాం, నేత నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా మొదటగా ఎన్నికల అధికారి గౌతమ్ కుమార్ వారికి గెలుపు ధృవీకరణ పత్రాలు అందజేయడం తో పాటు నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు.

సీతారామ జలాలతో రైతులో ఆనందం
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు రైతు ప్రత్యేక కృతజ్ఞతలు

ఏన్కూర్, నేటి శుభోదయ :
సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు కాలువల్లోకి నీరు చేరడంతో ఏన్కూర్ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. సకాలంలో సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు ఖరీఫ్ సాగు పనులను ఉత్సాహంగా ప్రారంభిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏన్కూర్ రైతు మేడా ధర్మారావు తన వ్యవసాయ పొలంలో వరి విత్తనాలు చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నీరు అందడంతో పంటలపై నమ్మకం పెరిగిందని, ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతు మేడా ధర్మారావు మాట్లాడుతూ.... సీతారామ ప్రాజెక్టు నీటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావడంలో విశేష కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సకాలంలో సాగునీరు అందించడం వల్ల వేలాది ఎకరాల్లో సాగు సాధ్యమైందని, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుం

దని పేర్కొన్నారు.రైతుల కష్టాలను అర్థం చేసుకుని సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు రైతాంగం ఎప్పటికీ రుణపడి ఉంటుందని ధర్మారావు అన్నారు.సీతారామ జలాలతో వైరా ప్రాంతంలో మళ్లీ పచ్చదనం పరుచుకుంటోందని, రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నీరు అందుతున్న ప్రాంతాల్లో రైతులు వరి సాగుకు సిద్ధమవుతూ పొలాల్లో విత్తనాలు చల్లే పనులను వేగవంతం చేస్తున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి...
-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని/పెద్దపల్లి, నేటి శుభోదయ :
మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం మంథని పట్టణంలో నిర్మించనున్న మార్కెట్ ఏరియాను, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని, నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని, రావులచెరువు పునరుద్ధరణ పనులను, రావులచెరువు సమీపంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న హరే కృష్ణ గోదాముల ఏర్పాటును పరిశీలించి అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ... ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని అన్ని పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా నిర్ణీత గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మంథనిలో నిర్మిస్తున్న మార్కెట్ ఏరియా, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, మార్కెట్ ఏరియాలో 100 ఫీట్ల రోడ్డు పనులను పరిశీలించి తరగతి గతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.రావులచెరువు పునరుద్ధరణ పనులను నాణ్యతతో పూర్తి చేసి చెరువును సంరక్షించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదే

శించారు. ముఖ్యంగా డ్రైనేజీ నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ రావులచెరువులోకి చేరకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.అనంతరం హరే కృష్ణ గోదాముల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్, జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం, భోజనం అందించే కార్యక్రమానికి అవసరమైన మౌలిక వసతులు, నిల్వ సదుపాయాలు, పంపిణీ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగంగా పూర్తి చేసి కార్యక్రమాన్ని సకాలంలో ప్రారంభించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పరిశీలనలో మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, కౌన్సిలర్ పెంటరాజు, ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ఆరిఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు
- తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్

పాల్వంచ, నేటి శుభోదయ :
గిరిజన హక్కుల రక్షణ కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిధిలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సమాఖ్య మూడవ రాష్ట్ర మహాసభల ప్రచార కరపత్రాలను శనివారం స్థానిక శేషగిరి భవన్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, సవాళ్లు మరియు వారు సాగిస్తున్న పోరాటాలు తదితర కీలక అంశాలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. గిరిజన సమాజం అంతా ఏకమై ఈ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను వేగవంతం చేయాలని, మహాసభలను విజయవంతం

చేయడానికి శ్రేణులంతా కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకట్, నాయకులు జర్పుల ఉపేందర్, బానోతు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

యాప్రాల్ జంక్షన్‌కు మహర్దశ.. ప్రమాదాలకు చెక్

నేరేడ్ మెట్, నేటి శుభోదయ : నిత్యం ట్రాఫిక్ రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో వాహనదారులకు ఇబ్బందిగా మారిన యాప్రాల్ జంక్షన్‌కు త్వరలోనే కొత్త రూపు రానుంది. ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేయడంతో పాటు ప్రమాదాలను పూర్తిగా నివారించేలా సమగ్ర అభివృద్ధి పనులకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ శనివారం యాప్రాల్ జంక్షన్, చంద్రగిరి కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో పాటు రహదారి మధ్యలో ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాన్స్‌మిషన్ టవర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించే అవకాశాలను సాంకేతికంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. టవర్‌ను సమీపంలోని పార్కు ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన భూమి లభ్యత, యాజమాన్య అంశాలను పరిశీలించి, అవసరమైతే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానంలో భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.యాప్రాల్ జంక్షన్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మొత్తం 53 ఆస్తులు ప్రభావితమవుతుండగా, 6,833.72 చదరపు గజాల భూసేకరణ అవసరమవుతోందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. అలాగే 57 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు చెట్లను స్థాన మార్పు చేయాల్సి ఉంటుందని తెలిపారు.విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు అవసరమైన అంచనాలు వెంటనే సిద్ధం చేసి విద్యుత్ శాఖ అధికారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని, రహదారి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. యాప్రాల్ జంక్షన్ అభివృద్ధి పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సిటీ ప్లానింగ్ అధికారులు, విద్యుత్ శాఖ ప్రతినిధులు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీలతో వెట్టి చాకిరీ సరికాదు

-సమస్యల పరిష్కారానికై పాదయాత్ర -ఎఐటీయూసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

భద్రాచలం, నేటి శుభోదయ :
చాలీచాలని వేతనాలతో బతుకుబండి లాగుతున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలపై పనుల భారం మోపుతూ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించడం దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాటి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు గోనె మనణి తో కలిసి నరాటి ప్రసాద్ మాట్లాడారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమంలో కీలక భూమిక పోషిస్తున్న అంగన్వాడీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అదనపు విధుల పేరుతో వేధింపులకు గురిచేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం నిర్వాకంతో అంగన్వాడీ వ్యవస్థ క్రమంగా కుప్పకూలుతోందని ఆరోపించారు. కనీస సౌకర్యాలు, అవసరమైన వనరులు సమకూర్చకుండా కేంద్రాలను గాలికొదిలేసి, మరోవైపు అంగన్వాడీలపై పనుల భారం మోపడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అనేక అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు పడే ప్రమాదం ఉందనిఅయన హెచ్చరించారు.అంగన్వాడీ టీచర్లకు బీఎల్ఓ విధులు అప్పగించడం కేంద్రాల నిర్వహణను పూర్తిగా దెబ్బతీస్తోందన్నారు. ఓటరు జాబితాల సవరణ, ఇంటింటి సర్వేల పేరుతో వారిని వీధుల వెంట తిప్పుతూ అసలు బాధ్యతలకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలు మూతపడితే చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన సేవలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. అంగన్వాడీలను బీఎల్ఓ విధుల నుంచి తక్షణమే మినహాయించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల వేళ అంగన్వాడీలకు హామీల వర్షం కురిపించిన పాలకులు అధికారంలోకి వచ్చాక వారి గోడును పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. అంగన్వాడీలకు గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించి పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, నెలకు 18 వేల వేతనం అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అధికారుల రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం చెవికెక్కించేలా నేటి నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పడుతున్న కష్టాలను ప్రజల ముందుంచి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామన్నారు. అంగన్వాడీల సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లపై స్పందించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే అంగన్వాడీల ఆగ్రహం ఉద్యమ ఉప్పెనగా మారుతుందని, రాష్ట్రవ్యాప్తంగా బలమైన పోరాటాలకు సిద్ధమవుతామని నరాటి హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవి కుమార్, వేల్పుల మల్లికార్జున్, మండల రాజు, రత్నకుమారి చిన్నారి, కంభం మెట్టు శ్రీనివాస్ మా రెడ్డి శివాజీ ఎస్వీఎస్ నాయుడు మీసాల భాస్కరరావు భద్రాద్రి వెంకటేశ్వరరావు మహేష్,గుంజ రామారావు, సత్తినేడు సాయిరాం, రుద్ర బ్రదర్స్, చింతల రామరాజు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు కై జన జాగరణ యాత్ర

- పాత పెన్షన్ విధానం కోసం ఎమ్మెల్యే కు వినతి

భద్రాచలం, నేటి శుభోదయ :
తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు ను కోరుతూ శనివారం జన జాగరణ యాత్ర ప్రారంభించారు. భద్రాద్రి శ్రీ సీతారామ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ జాగరణ యాత్ర ను ప్రారంభించారు. ఆగస్ట్ 23 న జరగనున్న ఛలో హైదరాబాద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఆలయ ఉత్తర ద్వారం నుండి భద్రాద్రి జిల్లా అధ్యక్షులు తుక్కాని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ బైక్ ర్యాలీ ని యాత్ర బస్సుతో కలిసి నిర్వహించారు. శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు కు వినతి పత్రం సమర్పించారు. సిపీఎస్ విధానంలో ని సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఎమ్మెల్యే కి వివరించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నాగు నాయక్, సురేష్ , మల్లికార్జున్, వెంకటేష్, మహాదేవ్ లు , చంద్రకాంత్, రాఘవేంద్ర ఉద్యోగ, ఉపాధ్యాయుల సమక్షంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రాజస్థాన్, చతిస్గఢ్ ,ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని విజయవంతంగా పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లారు."రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, రాష్ట్రంలోని 2.6 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల భవిష్యత్తుకు భరోసానిస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.

అని డిమాండ్ చేశారు

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను : ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హామీ
సిపీఎస్ సంఘ వినతిపై ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అంతా తమ కుటుంబ సభ్యులేనని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ అయిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా, మీ అందరి తరపున ముఖ్యమంత్రి దృష్టికి వినతిని తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు వేముల కామేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగునాయక్, సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, , జిల్లా నాయకులు రామకృష్ణ పూర్ణ, శ్రీను రఘురాం తెల్లం శ్రీనివాస్, పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గ పర్యటన.

సంగారెడ్డి, నేటి శుభోదయ : ఈ పర్యటనలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని వేగవంతం చేయటంపై చౌటకూరు, పుల్కల్, జోగిపేట మున్సిపాలిటీ, ఆందోల్, అల్లదుర్గ్ , వట్పల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు, సర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్స్, చైర్మన్, ఇతర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ బూతు లెవల్ ఏజెంట్లకు (BLA) లకు సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను సరైన విధంగా పూరించడంలో ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని BLA లకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అలసత్వం లేకుండా బూతుల వారీగా రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు (BLA) క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ఓటర్లతో, బూత్ లెవెల్ అధికారులకు (BLO) సహకారం అందించాలని, ఫారాల సేకరణలో సమన్వయ చేసుకొని గడువులోగా (జూలై -24) ప్రక్రియను పూర్తిచేసి ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయాల్సి ఉన్నందున ప్రతి ఒక్క ఏజెంట్, ముఖ్య కార్యకర్తలు బూతుల వారిగా ఓటర్లతో సమన్వయం చేసుకొని సహకరించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆందోల్ నియోజకవర్గం లో 100 శాతం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమం విజయవంతం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ BLA లు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో PCC డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డా . రాజీవ్, జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబు, నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ అయ్యప్ప స్వామి విగ్రహప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.

ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ : మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రం గారెడ్డి పర్యటించి గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం సందర్భంగా అయ్యప్పస్వాముల ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకుఅయ్య ప్పస్వాములు ఘనస్వాగతం పలికారు అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆ హ్వానం మేరకు విగ్రహప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారిని ఆలయ ట్రస్టు చైర్మన్ మారగోని మాస య్యగౌడ్ విఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ గురుస్వామి కావలి శ్రీనివాస్ ముదిరాజ్ అయ్యప్పస్వాములు కలిసి ఎమ్మెల్యేగారిని శాలువతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని డబ్బు లు అయినా మంజూరు చేయడానికి సిద్ధంగాఉంది అని అన్నారు రాబోయే రోజుల్లో ఆరుట్ల గ్రా మాన్ని ఒక ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తాను అనిఅన్నారు అనంతరం ఇందిరమ్మ కమిటీ స భ్యుల ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలో వికలాంగుడు మద్దెల బాలరాజు గౌడ్ ఇందిరమ్మ ఇల్లును సందర్శించిన ఎమ్మెల్యేమల్ రంగారెడ్డి బాలరాజుగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి కుటుంబ స మస్యలు తెలుసుకున్నాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వికలాంగులకు ముందు ప్రాధాన్యత ఇస్తుంది అని అన్నారు గ్రామంలో అర్హులైన వారందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చే యిస్తాం ఎవ్వరు ఆందోళన చెందవద్దు అనిఅన్నారుఇప్పటివరకు పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను త్వరలో ప్రారంభోత్సవం చేస్తాం అనిఅన్నారు అనంతరం అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకుడు పంబల బు గ్గారాములు నివాసానికి వెళ్లి పరామర్శించి బుగ్గరాములు ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు ఈకార్యక్రమంలో ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉ పసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మంచా ల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాజీ జెడ్పీటిసీ భూపతిగల్లా మహిపాల్ కాంగ్రె స్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి జిల్లాఅధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వింజమూరి ప్రేమకర్ రెడ్డి సహకార సంఘం డైరెక్టర్లు జె నిగే వెంకటేష్ యాదవ్ వేణుగోపాలరావు వింజమూరి రాంరెడ్డి కొత్తకురమ మంగమ్మశివకుమార్ చీమల జంగయ్యయాదవ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణ ముది రాజ్ మారలక్ష్మణ్ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూ కం బాలరాజ్ ముదిరాజ్ ప్రధానకార్యదర్శి చిందం శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రా వుల భాష గుడ్డి మల్ల చంద్రయ్య ముదిరాజ్ చిందం ఐలయ్య ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు అయ్యప్ప స్వాము లు తదితరులు పాల్గొన్నారు.

పుప్పాలగూడ శాఖ ఆధ్వర్యంలో మణికొండ ప్రాథమిక పాఠశాలకు టీవీ బహుకర.

రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :

శ్రీ వాసవీ మాత ఆశీస్సులతో మేము అవోపా పుప్పాలగూడ కుటుంబ సభ్యులు మణికొండ పరిషత్ ప్రాథమిక పాఠశాలకు టీవీ బహుకరించడం జరిగింద న్నారు.ఈ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది ముఖ్య అతిథిగా హాజరై,అవోపా పుప్పలగూడ యూనిట్ సభ్యులతో కలిసి శాంసంగ్ ఎల్ఈడీ టీవీని ప్రారంభిం చారు.శంకర అన్నా,బాలలత ఐఏఎస్ మేడమ్ స్ఫూర్తిదాయకమైన కథ గురించి ఉపాధ్యాయులు,విద్యార్థులతో పంచుకునారు.ప్రభుత్వ పాఠశాల పిల్లలు విభిన్న నేపథ్యాల నుండి వస్తారు కాబట్టి,ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా కష్టపడాల్సి వుంటుంది పిల్లలకు స్ఫూర్తిదాయకమైన కథల గురించి చెప్పమని ఆయన ఉపాధ్యాయులతో అన్నారు.అవోప పుప్పలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణు మాధవ్,పిల్లలు,ఉపాధ్యాయులు స్మార్ట్ టీవీని అభ్యసనం కోసం ఉపయోగించుకోవాలని,అలాగే పాఠశాలలోని వివిధ సంద ర్భాలలో దానిని వినియోగించుకోవాలని ఉపాధ్యాయులను కోరారు.అవోప పుప్పలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణు మాధవ్,పిల్లలు మరియు ఉపా ధ్యాయులు స్మార్ట్ టీవీని అభ్యసనం కోసం ఉపయోగించుకోవాలని,అలాగే పాఠ శాలలోని వివిధ సందర్భాలలో దానిని వినియోగించుకోవాలని ఉపాధ్యాయు లను కోరారు.కార్యక్రమానికి పుప్పాలగూడ యూనిట్ సభ్యులు దారం భానుచం దర్,ప్రధాన కార్యదర్శి,అప్పని యుగేందర్,కోశాధికారి,జె.సాయిరామ్,ఆర్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి,పందిరి కృష్ణ,పబ్బా మల్లేశం,దారం మల్లయ్య,బచ్చు రాము,భాస్కర్,కోటోరి ప్రకాష్,బాల రాజయ్య,షీలా కృష్ణ మూర్తి,టి నరేష్,జి నరేష్,అంధూరు దారం వేణు మాధవ్,అవోపా పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం భానుచందర్,ప్రధాన కార్యదర్శి అప్పని యుగేందర్, కోశాధి కారి తదితరులు పాల్గొన్నారు.

డిచ్ పల్లి ఖిల్లా రామాలయ కమిటీ నూతన కార్యవర్గం నియామకం

నిజామాబాద్ , నేటి శుభోదయ :

నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి లో గల అతిపురాతన ప్రఖ్యాత ఖిల్లా రామాలయ కమిటీతో పాటు హనుమాన్ ఆలయ నూతన పాలకవర్గం నియమితులయ్యారు.ఖిల్లా ఆలయ కమిటీ చైర్మన్ గా అప్పాల గంగదాస్,హను మాన్ ఆలయ కమిటీ చైర్మన్ గా మారు రఘుపతితో పాటు పాలకవర్గ సభ్యులను నియమించగా..ఈ సందర్భంగా నియామక పత్రాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి చేతుల మీదుగా శనివారం అందుకున్నారు.ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కార్యవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఖిల్లా రామాలయం కమిటీ పాలకవర్గం సభ్యులు అశోక్,బుస రవి,చెలిమెల వినయ్,ఆర్మూర్ లలిత,కృష్ణమాచారితో పాటు హనుమాన్ ఆలయ కమిటీ పాల కవర్గం సభ్యులు సుర శ్యామ్,ఆడెపు రాజు,కొంగ ప్రవీణ్,చిన్న ముత్తవ్వ,కృష్ణమా చారి,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్,డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్,రాంచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

మణికొండ మాజీ వైస్ చైర్మన్ కొండకళ నరేందర్ రెడ్డిని పరమర్శించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు.

రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :

మణికొండ మాజీ వైస్ చైర్మన్ కొండకళ నరేందర్ రెడ్డి కొంత కాలంగా అనారో గ్యంతో బాధపడుతున్న ఆయనను భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు విచ్చేసి వారి ఆరోగ్య యోగక్షేమాలు,బాగోగులు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.అతని ఆరోగ్యం పూర్తిగా కోల్కొని తొందర్లోనే ప్రజా సేవకు సిద్ధం కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి అంజన్ కుమార్ గౌడ్,మణికొండ మున్సిపాలిటీ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణలో బీ.ఎల్.ఏలు

క్రియాశీలకంగా వ్యవహరించాలి - కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచన

నిజామాబాద్ , నేటి శుభోదయ :

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణలో బూత్ లెవెల్ ఏజెంట్లు(బీఎల్ఏ) క్రియాశీలక పాత్ర పోషించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.ఇది కేవలం బూత లెవెల్ అధికారుల(బీఎల్ఓ)పని అని భావించకుండా,బీఎల్ఏ లు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.నిజామా బాద్ నగరంలోని 6వ డివిజన్ పరిధిలో గల భూలక్షి మాత ఆలయం కమ్యూనిటి హాల్ లో శనివారం సాయంత్రం నగర మేయర్ కే.ఉమారాణితో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు,బీ.ఎల్.ఓలు,బీ.ఎల్.ఏలు,సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....నిజామా బాద్ జిల్లాలోని ఆర్మూర్,బాల్కొండ,బోధన్,నిజామాబాద్ రూరల్,బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ఆశించిన రీతిలో వేగవంతంగా సాగుతోందని,అర్బన్ నియోజకవ ర్గంలో మాత్రం మందకొడిగా ఉందని పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా గణాంకాలతో సహా వివరించారు.అర్బన్ సెగ్మెంట్ లోనూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు బీ.ఎల్.ఏలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ,పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిం చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు.ముఖ్యంగా ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారంను బీ.ఎల్.ఓకు అందించేలా చూడాలన్నారు.బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి రోజు 50 ఎన్యూమరేషన్ ఫారంలు ఓటర్ల నుండి స్వీకరించి బీ.ఎల్.ఓలకు అందజేయవచ్చని సూచించారు.గడువు ముగింపు సమయం వరకు వేచి చూడకుండా,ముందుగానే ఎన్యూమరేషన్ ఫారంలు అందించేలా ఓటర్లకు అవగాహన కలిపించాలని అన్నారు.లేని పక్షంలో ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేయడానికి,అబ్సెంట్,షి ఫ్టేడ్,డెత్/డబుల్ (ఏ.ఎస్.డీ) జాబితా రూపొందించడానికి సమయం సరిపోక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు వేగంగా తమ ఎన్యూ మరేషన్ ఫారంలు అందించేలా బీ.ఎల్.ఏలు క్షేత్రస్థాయిలో తిరుగుతూ కృషి చేయాలని సూచించారు.ఓటర్లు తగిన వివరాలు తెలుసుకునేందుకు వీలుగా వారికి సహకారం అందించేలా నగరం లోని ప్రతి మున్సిపల్ సర్కిల్ పరిధిలో హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటు చేశామని అన్నారు.ఓటర్లు ఎన్నికల సంఘం వెబ్ సైట్ నుండి కూడా వివరాలు పొందవచ్చని సూచించారు.ఒకవేళ ఎవరి కైనా గత ఎస్.ఐ.ఆర్ ఓటరు జాబితా వివరాలు తెలియకపోయినా సరే,వారు ఎన్యూమరేషన్ ఫారంపై కనీసం సంతకం చేసి గడువు తేదీ లోపు బీ.ఎల్.ఓలకు అందించాలన్నారు.అప్పుడే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో ఉంటుందని అన్నారు.ఒకవేళ ఎన్యూమరేషన్ ఫారం బీ.ఎల్.ఓలకు తిరిగి ఇవ్వకపోతే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతు అవుతుందని కలెక్టర్ కరాఖండీగా తేల్చి చెప్పారు.ఎంతటి వారు అయినా,ఏ స్థాయిలో ఉన్నా సరే,ఎన్యూ మరేషన్ ఫారం అందించాల్సిందేనని స్పష్టం చేశారు.ఎన్యూమరేషన్ ఫారంలో వివరాలు పొందుపర్చలేకపోయిన వారికి,తప్పుగా వివరాలు నమోదు చేసిన వారికి ముసాయిదా జాబితాను వెల్లడి చేసిన అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటీసు ఇచ్చి,హియ రింగ్ కు పిలుస్తారని కలెక్టర్ తెలిపారు.అప్పుడు వారు తగిన ధృవీక రణ పత్రాలు చూపిస్తే ఓటరు జాబితాలో పేరు నమోదు చేస్తారని అన్నారు.కానీ అసలుకే ఎన్యూమరేషన్ ఫారం తిరిగి ఇవ్వకపోతే మాత్రం ముసాయిదా ఓటరు జాబితానే పేరు ఉండదని అన్నారు.దీ నిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఓటరు,ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఓటర్లు అందరూ తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారంలను బీ.ఎల్.ఓలకు అందించాలని కలెక్టర్ సూచించారు.ఈ దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక చొరవ చూపాలని,ఇప్పటివ రకు కొంత జాప్యం జరిగి ఉండవచ్చని,ఇకనైనా అర్బన్ లో ఎన్యూ మరేషన్ ఫారంల స్వీకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా కృషి చేయాలని హితవు పలికారు.ఈ సందర్భంగా బీ.ఎల్.ఏల సందేహా లను కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి,మల్లేష్ యాదవ్,వైష్ణవి,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు,నిజామా బాద్ నార్త్ తహసిల్దార్ హరికిషోర్,బీ.ఎల్.ఓలు,బీ.ఎల్.ఏలు,సూప ర్వైజర్లు,స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

ఘనంగా బండి సంజయ్ పుట్టినరోజు వేడుకలు

-బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్

వరంగల్, నేటి శుభోదయ :

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 38వ డివిజన్ ఖిలా వరంగల్ లో శనివారం కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు ఇనుముల అరుణ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిగా బిజెపి జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్ మరియు మున్నూరుకాపు సంఘం పెద్దలు జోకు వేణు విచ్చేసి కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్ల స్థానికుల పంపిణీ చేశారు. అనంతరం వారు స్వయంబు శంభులింగేశ్వర దేవస్థానంలో బండి సంజయ్ నిండు నూరేళ్లు యోగక్షేమలతో, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ అంకాల జనార్దన్, సీనియర్ నాయకులు పుప్పాల రాజేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎల్లబోయిన చంద్రమోహన్, డివిజన్ కన్వీనర్ తోటకూరి రాజేశ్వరి, మండలం ఉపాధ్యక్షులు రేపల్లె స్వర్ణజ, కార్యదర్శి సుంకరి రాజు, కాలువ మహేష్,బూత్ అధ్యక్షులు కండ్రాతి శ్రీను, ఇనుముల రాజు, మూర్తి, రాళ్ళబండి మున్నా, పుప్పాల ప్రవీణ్,గొట్టం శ్రవణ్,ఆకుతోట కిరణ్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ఫిరంగి నాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత..

-శంషాబాద్,సాతం రాయి గ్రామాలలో ఫిరంగినాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..

రాజేంద్ర నగర్, నేటి శుభోదయ

నిజాం కాలం నాటి చారిత్రక 'ఫిరంగి నాలా' రంగారెడ్డి జిల్లాలో తీవ్ర కబ్జాలకు గురవుతోంది.షా బాద్ మండలం చందన్వెల్లి నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు దాదాపు 85 కిలో మీటర్ల పొడవున ప్రవహించే ఈ కాలువను,రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు,ప్రహరీలు నిర్మిస్తు న్నారు.శంషాబాద్ మండలంలోని శాతంరాయి,శంషాబాద్ లోని సదరన్ మెగా టౌన్ షిప్ వెంచర్ పరిధిలో ఫిరంగినాలను స్థానికులతో కలిసి పరిశీలించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసిం హులు..ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ నగరంపై వరద ప్రభావం తగ్గడానికి నిర్మించిన ఫిరంగి నాల షాబాద్ మండలంలో చందనవెల్లి గ్రామంలో మొదలుకొని ఇటుపక్క ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు 84 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా నీరు అందించే ఫిరంగి నాల కాలువపై నేడు అభివృద్ధి పేరిట భూ బకాసురుల కబంధహస్తాల్లో కనుమరుగుతున్న వైనం పట్ల విచారం వ్యక్తం చేశారు.సాతంరాయి గ్రామంలో ఫిరంగినాలను పూడ్చి వేసి ఇటు అపర్ణ కన్స్ట్రక్షన్ మరోపక్క వసుంధర కన్స్ట్రక్షన్స్,బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.నేడు ప్రకృతి వనరులపై రియల్ ఎస్టేట్,అభివృద్ధి పేరిట కనుమరుగవుతున్న ఫిరంగినాలపై ఇటు రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి ఎవరైతే ఆక్రమణలకు పాల్పడ్డారో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఫిరంగి నాలను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు నీరు అందే విధంగా చూడాలని నాలాలో ఎలాంటి మురుగు నీరు చేరకుండా పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం...

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మంథని/పెద్దపల్లి, నేటి శుభోదయ :
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ–సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.భూ రీ–సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఖమ్మం జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ పాల్గొన్నారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు.ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించిన ప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు.భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ–సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించు కోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ–సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ–సర్వే చేపడు తున్నట్లు తెలిపారు.రీ–సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ–సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి–2027 నాటికి మూడు విడతల్లో రీ–సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు.రీ–సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశిం చారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు.ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్క రించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు.పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ–సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు అనంతరం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ... తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ–సర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి–2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ–సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీ యంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 41 వేల గుడిసెలను గుర్తించామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగు తోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్ప గించాలని సూచించారు.సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, రెవెన్యూ డివిజనల్ అధికారి బి. గంగయ్య, సురేష్, ఏ.డి.సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచా లకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య

వరంగల్, నేటి శుభోదయ : వరంగల్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ లో మాజీ మంత్రి,ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్ తో కలసి శనివారం అందజేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) కోసం తూర్పు నియోజకవర్గంలోని నలబై ఐదు మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి లబ్ధిదారులకు రూ" 25 లక్షల మొత్తాన్ని ఆర్థిక సహాయం కింద చెక్కుల రూపంలో పంపిణీ చేశారు..ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనై ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందించే ఆర్థిక సహాయం గొప్ప వరదాయని అని, ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా బాగుంటేనే అన్ని బాగుంటాయని అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలో చేపట్టిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకం కింద పేద ప్రజలకు పది లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్యం అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేప ట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ మెంబర్ నల్లగొండ రమేష్, తాజా మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజ్ శిరీష శ్రీమన్, తత్తరీ లక్ష్మణ్,జన్ను ఆరోహన్, ధూపం సంపత్, యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, యూత్ కాంగ్రెస్ తూర్పు నియోజ కవర్గం అధ్యక్షుడు సలీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్షి , ఎన్ ఎస్ యు ఐ మాజీ నగర అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళి గౌడ్, కుర తోట సదానందం, ఎల్ శ్రీనివాస్,మురళి గౌడ్, గిరి గిరి పుష్ప, కాశెట్టి వేణు, బోలుగొడ్డు శ్రీనివాస్, రాముల బాబు, బైరబోయిన చంద్ర మౌళి, బిట్ల రవి, బత్తిని లింగయ్య, మార్త ఆంజ నేయులు,గుండేటి సతీష్. యూత్ కాంగ్రెస్ నాయకుడు వరుణ్ గౌడ్,21వ డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్ కమార్, బత్తుల వినోద్, ఇనుగాల బాబు, ఈటల ఉమేందర్, యాదగిరి, బండ్ల సురేందర్, ఇంతియాజ్, వివిధ డివిజనుల సీనియర్ నాయకులు, కార్యకర్తలు,ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ లో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం..

మియాపూర్, నేటి శుభోదయ : మియాపూర్ ప్రగతి ఎంక్లేవ్ లో ప్రగతి కళా మండపం లో ఆదివారం 12 వ తేది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ ప్రసాద్ స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రముఖ వైద్యులచే ఉచితం గా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిలో స్త్రీలు, పురుషులకు అవసరమగు వైద్య పరీక్షలు చేయించుకోవాల్సింది గా నిర్వాహకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ రమాదేవి దంపతులు కోరుచున్నారు.

నిజాంపేటలో అంగరంగ వైభవంగా ప్రారంభించిన ధనిక సిల్వర్ జ్యువెలరీ షోరూమ్

శేరిలింగంపల్లి, నేటి శుభోదయ : హైదరనగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ లో శనివారం రోజు ఉదయం అంగరంగ వైభవంగా ధనిక సిల్వర్ జ్యువెలరీ షోరూమ్ ను ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిలుగా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, స్థానిక శాసన సభ్యులు,పి ఎ సి చైర్మన్ అరెకేపూడి గాంధీ, హైదర్ నగర్ మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్షి నారాయణ తదితరులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రిబ్బన్ కటింగ్, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యత గల జ్యూవెలరీ కస్టమర్ లకి అత్యాధునిక డిజైన్లతో అందించి ఆర్థికంగా అభివృద్ధి లోకి రావాలని ధనిక జ్యువెలరీ షోరూమ్ యజమానులు శ్రీనివాస్,మధులకి సూచిస్తూ ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షో రూమ్ సేల్స్ విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలకి మంత్లీ స్కీమ్ లలో కూడా ఆభరణాలు కొనుగోలు చేసే అవకాశం కూడా కల్పించడం జరింగింది అనితెలిపారు. హైదరాబాద్ లో దిల్ సుకునగర్ లో మొదటి ధనిక సిల్వర్ జ్యువెలరీ షోరూమ్ ఇపుడు నిజాంపేట్ లో రెండో బ్రాంచ్ ను ప్రారంభో త్సవం చేయడం ఆనందంగా ఉందని కస్టమర్ దేవుళ్ళు ఆదరించి ఆశీర్వదిస్తారని తమ ఆశాభావం ను వ్యక్తం చేసారు.

ప్రకాష్ నగర్ లోని బొడ్రాయి ప్రక్కన నిర్మిస్తున్న మసీదు నిర్మాణం వెంటనే నిలిపివేయాలి

రాజేంద్ర నగర్, నేటి శుభోదయ : శంషాబాద్ మున్సిపల్ సర్కిల్ పరిధి ప్రకాష్ నగర్ లోని బొడ్రాయి కమిటీ గుడి ఆవరణలో బస్తీ వాస్తులం కూర్చొని ఒక తీర్మానం చేయడం జరిగిందన్నారు.బొడ్రాయి పక్కన గల సర్వేనెంబర్.124/1ఏ,124/2ఏ లో ఉన్న భూమి యజమాని ఇఫ్తే కారు షరీఫ్ తన భూమి ప్రకాష్ నగర్ కాలనీ పోతురాజు గుడి పక్కన ఎలాంటి మజీదు లేకుండా ఉన్నది.ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో కొత్తగా ఒక మజీద్ కడుతు న్నారు.తన భూమిలో మసీదుకు ఎలాంటి పర్మిషన్లు లేదు,పోతురాజు గుడి ప్రక్కన కట్టడం ఇది హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా భావిస్తూ షరీఫ్ ఇప్పే కార్ షరీఫ్ ను కలవడం జరిగిందన్నారు.తాను మజీదును అక్కడే నిర్మిస్తానని చెప్పడం జరిగింది.ఇప్పటివరకు బస్తీలలో కలిసిమెలిసిగా ఉన్న మేము భవిష్యత్తులో హిందూ ముస్లిం భావాలకు దెబ్బతిన్న విధంగా ఉన్నందున ఇక్కడ ఎలాంటి ప్రభుత్వ పరిమిషన్ లేకుండా నిర్మించడానికి వ్యతిరేకిస్తున్నాము అన్నారు.మసీదు నిర్మాణం ఇలాగే కొనసాగితే ప్రభుత్వం అధికారుల ఆఫీసుల ముందు పోరాటం చేయాలని నిర్ణయించుకోవడం జరిగినది.ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే మజీద్ నిర్మాణాన్ని ఆపేయగలరని కోరారు.అధికారులు ఎలాంటి చర్యలు తీసు కోకుంటే ఆర్డీఓ,కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుంది అని తీర్మానించడం జరిగింది.ఈ కమిటీలో నర్ర పాండు,నర్ర యాదగిరి,నర్రగిరి,నర్ర శ్రీనివాస్,నర్ర రామారావు,నర్రా బాబు,మక్కల విజయ్,ఎం.చంద్రశేఖర్,ఎమ్.మహేష్,ఎం ప్రేమ్ కుమార్,ఎం రజినీకాంత్,వి.సందీప్,ఎం రాజు,జెలేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.